

రాబిన్‌హుడ్‌లో నటిస్తున్నా

శ్రీవారి సేవలో శ్రీలీల

హీరో నితిన్‌తో కలిసి 'రాబిన్‌హుడ్' అనే చిత్రంలో నటిస్తున్నట్టు హీరోయిన్ శ్రీలీల తెలిపారు. మంగళవారం ఉదయం కుటుంబ సమేతంగా వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చాక మీడియాతో మాట్లాడారు. తన అమ్మమ్మ పుట్టినరోజు సందర్భంగా స్వామిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నామన్నారు. తాను పని మొదలుపెట్టే ముందు, పూర్తయ్యాక తిరుమలేశుడిని దర్శించుకోవడం ఆనవాయితీగా మారిపోయిందన్నారు. రాబిన్‌హుడ్‌తోపాటు మరికొన్ని ప్రాజెక్టులు కూడా ఒక్కొక్కటిగా చేస్తున్నానన్నారు. ఆలయం ముందు శ్రీలీలను చూడటానికి.. సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవడానికి అభిమానులు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేటినుంచి ఈసెట్ కౌన్సెలింగ్

8న సీట్ అలాట్‌మెంట్

తిరుపతి(విద్య), జూన్ 25: ఏపీ ఈసెట్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం నుంచి ప్రారంభమౌతుందని కో-ఆర్డినేటర్ డాక్టర్ వై ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. డిప్లొమా ఇంజనీరింగ్ ఉత్తీర్ణులైన విద్యార్థులు బుధవారం నుంచి ఈనెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి.. రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేశాక కళాశాలలోని హెల్ప్‌సెంటర్‌లో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు.జూలై 1నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు, 5న మార్పు, చేర్పులు చేసుకోవచ్చని వివరించారు. జూలై 8న సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని తెలిపారు. స్పెషల్ కేటగిరీకి చెందిన పీహెచ్, ఎన్‌సీసీ, సీఏపీ, స్పోర్ట్స్ గేమ్స్, ఆంగ్లో ఇండియన్స్, స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాక ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకుని విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని కౌన్సెలింగ్ కేంద్రంలో జూలై 2, 3 తేదీల్లో హాజరుకావాలని సూచించారు.





బహిరంగ సభకు పోటెత్తిన జనం

ఉద్వేగ స్వరం.. అభివృద్ధి పథం!

- కుప్పం అభివృద్ధిపైనే ప్రధాన ప్రసంగం
- మెజారిటీ తగ్గడంపై ఆవేదన
- మీ భవిష్యత్తుకోసం ఎంత కష్టమైనా పడతానని హామీ
- కుప్పంలో చంద్రబాబు అంతరంగం ఆవిష్కరణ
- ఆద్యంతం ఆకట్టుకున్న వినూత్న వ్యవహార శైలి

'నాకు వచ్చింది అధికారం కాదు, బాధ్యత. దీన్ని కుప్పంలో నిరూపిస్తా. నేను చెప్పేది చేస్తా. మీ జీవితాలు బాగు పడుతాయి.'

'నేను ప్రజలకోసమే సంపాదిస్తా. ప్రజలకోసమే కష్టపడుతా. తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలి.'

'రాష్ట్రమంతా ఒక ఊపు ఊపిన మెజారిటీలు వచ్చాయి. కుప్పంలో 48 వేలేనా? ఎన్నడూ బయటకు రాని మా ఇంటి ఆడవాళ్లు వచ్చారు. భువనేశ్వరి స్వయంగా క్యాంపైన్ చేసే పరిస్థితి వచ్చింది.'

'సమాజంలో ఇంకా మానవత్వం బతికే ఉంది. అందుకు నిదర్శనం ఒక ఆడబిడ్డ తనకున్న మూడు ఎకరాల్లో ఒక ఎకరా అమ్మి మరీ రూ.25 లక్షలు అమరావతి నిర్మాణానికి విరాళమిచ్చింది.'

కుప్పంలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగంలోని ఉద్వేగ సందర్భాలు ఇవి. భావోద్వేగ పూరితంగా ప్రసంగించిన ఆయన కుప్పం అభివృద్ధి గురించి ఏమాత్రం మరచిపోలేదు. సొంత నియోజకవర్గానికి ఏం చేయబోతున్నారో చెబుతూనే, ఇక్కడ తనకు వచ్చిన మెజారిటీ పట్ల తీవ్ర అసంతృప్తి, మనస్తాపం వ్యక్తం చేశారు. ఎక్కడా ఎటువంటి భేషజాలు, అధికార దర్పాలు ప్రదర్శించకుండా సరికొత్తగా తనను తాను ఆవిష్కరించుకున్న తీరు, ప్రసంగ శైలి ఆద్యంతం ఆకట్టుకుంది.

చంద్రబాబు కుప్పం పర్యటన తొలిరోజైన మంగళవారంనాడు 30 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. హెలికాప్టరులో మధ్యాహ్నం ఒంటి గంటకు పీఈఎస్‌లోని హెలిప్యాడ్‌లో దిగిన సీఎం అధికారులు, పార్టీ నాయకుల నుంచి స్వాగత సత్కారాలు అందుకున్నారు. తర్వాత నేరుగా హంద్రీనీవా కాలువ సందర్శనకు బయలుదేరారు. జల్లిగానిపల్లె వద్ద మధ్యాహ్నం 2 గంటలకు, చిన్నారిదొడ్డి వద్ద 2.40 గంటలకు కాలువను సందర్శించి అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు కూడలిలో బహిరంగ సభలో సాయంత్రం 4.35 గంటల నుంచి 5.55 గంటలదాకా ఏకధాటిగా ప్రసంగించారు.



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

● కుప్పం అభివృద్ధిపైనే దృష్టి

సాధారణ వ్యవహారశైలికి భిన్నంగా ఈసారి చంద్రబాబు ప్రధానంగా కుప్పం అభివృద్ధిపైనే దృష్టి పెట్టారు. అప్పుడప్పుడూ రాష్ట్రాభివృద్ధి, రాజధాని అమరావతి వంటి అంశాలను ప్రస్తావించినా అంతలోనే కుప్పం నియోజకవర్గానికి ఏం చేయబోతున్నారో చెప్పారు. గత వైసీపీ పాలనలో కుప్పంలో చెలరేగిన రౌడీమూకలను హెచ్చరిస్తూనే, రాబోయే అయిదేళ్లలో ఏయే అంశాలలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పెట్టాలనుకున్నారో ఏకరువు పెట్టారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'మళ్లీ సీఎంగా..' అన్న శీర్షికన ప్రచురితమైన వార్తాకథనంలో ప్రస్తావించిన వివిధ ఆగిన అభివృద్ధి పనులను గురించి పేర్కొంటూ అన్నింటినీ సాధ్యమైనంత త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

అమరావతి, మెజారిటీపై భావోద్వేగం: చంద్రబాబు తన మెజారిటీ కేవలం 48 వేలకు పరిమితం కావడాన్ని భావోద్వేగంతో ప్రస్తావించారు. 'ఒకప్పుడు కుప్పంలో అందరూ మంచివాళ్లే ఉండేవారని, ఇప్పుడు కొంతమంది మారిపోయారు. మీరు బాగుపడితే చూడాలని నా కోరిక. ఇక్కడ ఇప్పుడు పుల్లలు పెట్టేవాళ్లు తయారయ్యారు. అయినా బాధలేదు. వచ్చే అయిదేళ్లలో వారిని మారుస్తా. ప్రతి కుటుంబానికి మంచి జరిగేలా చూస్తా.' అన్నారు. అమరావతిని తలచుకుని భావోద్వేగంతో కదిలిపోయారు. అమరావతికి యువతి ఒకరు ఎకరా అమ్మి ఇచ్చిన విరాళం గురించి ప్రస్తావించారు. డ్వాక్రా, మెప్మా సంఘాలతోపాటు టీడీపీ కుప్పం రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఇచ్చిన రూ. లక్ష విరాళాలను స్వీకరిస్తూ, ఆయా సందర్భాల్లో అమరావతికోసం తాను ఎంత చేసింది గుర్తు చేసుకున్నారు.

- కుప్పం

తోతాపురి టన్ను రూ.30వేలకే కొనుగోలు చేయాలి

● కలెక్టర్ ఆదేశాలను పాటించండి: హెచ్‌వో



మండీలో మామిడి కాయల ధరలను ఆరా తీస్తున్న సౌజన్య

పుత్తూరు అర్బన్, జూన్ 25: కలెక్టర్ ఆదేశాల ప్రకారం తోతాపురి మామిడిని టన్ను రూ.30వేలు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని హార్టికల్చర్ అధికారి (హెచ్‌వో) సౌజన్య స్పష్టం చేశారు. 'సీజన్ ముగిసేటప్పుడూ ధరాఘాతమే' అనే శీర్షికన కథనం మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన హెచ్‌వో.. పుత్తూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న మామిడి కాయల మండీలను పరిశీలించారు. కలెక్టర్ పదిరోజుల క్రితం ఇచ్చిన ఆదేశాల ప్రకారం తోతాపురి కాయలను టన్నుకు రూ.30వేలకు కొనుగోలు చేయాలని చెప్పారు. అయితే మంగళవారం కూడా తోతాపురి ధర అంతంతమాత్రంగానే పలికింది. మండీల్లో టన్ను రూ.23వేలకు కొనుగోలు చేశారు. పల్ప్ ఫ్యాక్టరీలు ధర పెంచితే తాము కూడా ఆ మేరకే కొనుగోలు చేస్తామని మండీల యజమానులు పేర్కొన్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నేడు డయేరియా నిర్మూలన కార్యక్రమం

తిరుపతి(వైద్యం), జూన్ 25: జిల్లావ్యాప్తంగా బుధవారం డయేరియా నిర్మూలనకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలుచోట్ల విజృంభిస్తున్న డయేరియా కేసులను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖతోపాటు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, మున్సిపాలిటీ శాఖల అధికారులూ పాల్గొంటారన్నారు.

వీఆర్‌ఎస్ తీసుకున్న శ్రీనివాసరాజు

● టీటీడీ జేఈవోగా సుదీర్ఘకాలం పనిచేసి.. తనదైన ముద్రవేశారు

తిరుమల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) జేఈవోగా సుదీర్ఘకాలంగా పనిచేసిన కేఎస్ శ్రీనివాసరాజు వీఆర్‌ఎస్ తీసుకున్నారు. ఏపీ ఐఏఎస్ క్యాడర్‌లో 2001 బ్యాచ్‌కు చెందిన ఆయన 2011లో వైజాగ్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న సమయంలో టీటీడీ జేఈవోగా నియమితులయ్యారు. ఏప్రిల్ 20వ తేదీన జేఈవోగా బాధ్యతలు తీసుకుని 2019 జూన్ వరకు ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ఎనిమిదేళ్ల రెండు నెలలపాటు పనిచేశారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాల్లో జేఈవోగా విధులు నిర్వహించి, టీటీడీలో తనదైన ముద్ర వేశారు. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక ఆయన ఇంటర్ కేడర్‌పై తెలంగాణ రాష్ట్రానికి వెళ్లారు. మార్చి నెలతో డిప్యుటేషన్ గడువు ముగియడంతో పొడిగింపునకు క్యాట్‌ను ఆశ్రయించారు. అనుమతి రాకపోవడంతో ఏపీకి రాక తప్పలేదు. గత మే నెలలో ఏపీ సీఎస్‌కు రిపోర్టు చేశారు. టీటీడీ ఈవోగా వచ్చేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేసినా కూటమి ప్రభుత్వం శ్యామలరావును ఈవోగా నియమించింది. దీంతో ఈనెల 19వ తేదీన శ్రీనివాసరాజు వీఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో మంగళవారం ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

జేఈవోగా చేసిన పనులివే..

శ్రీవారి భక్తుల క్యూలైన్ల నిర్వహణ, రద్దీ క్రమబద్ధీకరణలో పనితనం చూపారు. ఆలయంలో మూడు క్యూలైన్ల ఏర్పాటు కూడా శ్రీనివాసరాజు ఆలోచనే. ఐఐటీ ఎంటెక్ చదువుకున్న నేపథ్యంలో టీటీడీలో ఐటీ వినియోగాన్ని విస్తృతం చేశారు. క్యూలైన్లు, కంపార్టుమెంట్లలో ఉండే భక్తులకు నిరంతరం అన్నప్రసాదాలు అందజేసేలా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. వీవీఐపీలకు, సామాన్యులకు సంతృప్తికరంగా దర్శనం చేయించడంలోనూ చురుగ్గా పనిచేశారు. రద్దీ సమయాల్లో బ్రేక్ దర్శనాలను రద్దు చేయడం అనే పద్ధతిని తీసుకురావడంతోపాటు సామాన్య భక్తులకు దర్శన సమయాన్ని తగ్గించేందుకు సాయంత్రం వీఐపీ బ్రేక్‌ను శాశ్వతంగా రద్దు చేశారు. గదుల కోసం భక్తులు గంటలు తరబడి క్యూలైన్‌లో నిలబడే అవసరం లేకుండా టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. సెల్‌కు మెసేజ్ అందాక వచ్చి గదిని నేరుగా తీసుకునే వెసులుబాటు కల్పించారు. అధిక లడ్డూలు తయారు చేసేందుకు సిబ్బంది సంఖ్యను పెంచడం, ఆర్జిత సేవా టికెట్లకు లక్కీ డిప్, వాహనాల పార్కింగ్ ప్రదేశాల అభివృద్ధి, సహస్రదీపాలంకార మండపం మార్పిడి, మాడవీధుల విస్తరణ, నూతన స్వర్ణరథం తయారీ, పార్కుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.



కుటుంబ సభ్యులతో శ్రీవారి ఆలయం ముందు కేఎస్ శ్రీనివాసరాజు (ఫైల్ ఫొటో)

'టెట్' ఫలితాల విడుదల

చిత్తూరు (సెంట్రల్), జూన్ 25: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫలితాలను మంగళవారం రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఎన్నికల ముందు జగన్ ప్రభుత్వం బీఈడీ, డీఎడ్ అభ్యర్థుల కంటి తుడుపు చర్యగా కేవలం 6100 ఖాళీలు మాత్రమే భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. హడావుడిన చేపట్టిన ఈ ప్రక్రియలో భాగంగా ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు టెట్ నిర్వహించారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో ఫలితాల విడుదలకు బ్రేక్ పడింది. ఈ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 31,037 మంది బీఈడీ, డీఎడ్ అభ్యర్థులు పరీక్షలు రాశారు. తిరుపతి జిల్లాలో 19,859 మంది కాగా, చిత్తూరు జిల్లాలో 7,173 మంది, అన్నమయ్య జిల్లాలో 4005 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. వీరిలో 18 వేల మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గతంలో టెట్ రాయడంలో అవకాశం కోల్పోయిన బీఈడీ, డీఎడ్ అభ్యర్థులతో పాటు ఇటీవల నిర్వహించిన టెట్‌లో ఫెయిలైన వాళ్లకూ రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. జూలై ఒకటి నుంచి టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో విద్యాశాఖ అందుకు తగిన విధంగా సన్నాహాలు చేస్తోంది. కాగా, జూలై ఒకటో తేదీన డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనుండటంతో వీరిలో ఆశలు చిగురించాయి.

ఎట్టకేలకు కోర్టు ఆదేశాలు అమలు

గత ప్రభుత్వ హయాంలో తొలగించిన 23 మంది అకడమిక్ కన్సల్టెంట్లు మళ్లీ విధుల్లోకి..

ఉత్తర్వులు జారీ చేసిన ఎస్వీయూ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 25: గత ప్రభుత్వ హయాంలో ఎస్వీ యూనివర్సిటీలో తొలగించిన 23 మంది అకడమిక్ కన్సల్టెంట్లు మళ్లీ విధుల్లోకి చేరారు. ఉద్యోగాల నుంచి తొలగించాక వీరంతా న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. విచారించాక వీరిని విధుల్లోకి తీసుకోవాలని రెండేళ్ల క్రితమే వర్సిటీ అధికారులను కోర్టు ఆదేశించింది. అయినా వీరిని విధుల్లోకి తీసుకోకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. ఇపుడు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో తొలగించిన ఈ 23 మంది అకడమిక్ కన్సల్టెంట్లను విధుల్లోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కూడా వర్సిటీ అధికారులు జారీ చేశారు. దీనిపై విధుల్లోకి చేరిన అకడమిక్ కన్సల్టెంట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర్వులిచ్చిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● 15 దుంగలు, 4 వాహనాల స్వాధీనం



మంగళం, జూన్ 25: కడప జిల్లా మల్లేపల్లి అటవీప్రాంతంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 15 ఎర్రచందనం దుంగలతోపాటు రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో ఆర్‌ఎస్‌ఐ మురళీధర్‌రెడ్డి బృందం మంగళవారం కడపజిల్లా మల్లేపల్లి అటవీప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. సమీపంలోని ఆటోనగర్ చేరుకునేసరికి అక్కడ కొందరు స్మగ్లర్లు రెండు కార్లలో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. చుట్టుముట్టగా కొందరు పారిపోయారు. ఆరుగురు స్మగ్లర్లను పట్టుకున్నారు. విచారణలో వీరిని కడపకు చెందిన యాతగిరి హరి(42), కొప్పిలి సుధాకర్‌రెడ్డి(29), తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ప్రభు(30), రమేష్(31), రవి(34), అయ్యప్పన్ మునియన్(20)గా గుర్తించారు. వీరినుంచి రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలతోపాటు 15 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఐదుగురు స్మగ్లర్ల కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు.

ఎంత పెద్ద పాములో..!



తిరుమల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం రెండు భారీ పొడవు కలిగిన జెర్రిపోతు పాములు పట్టుబడ్డాయి. టీటీడీ అధికారులు నివాసముండే బీ టైప్ క్వార్టర్ వద్దకు సుమారు ఎనిమిది అడుగుల పొడవు కలిగిన జెర్రిపోతు వచ్చింది. గుర్తించిన అధికారులు, సిబ్బంది వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. అలాగే తిరుమలలో సందర్శనీయ ప్రదేశమైన శిలాతోరణం వద్ద కూడా ఆరున్నర అడుగుల పొడవున్న జెర్రిపోతు కనిపించింది. భక్తులు సమాచారంతో భాస్కర్‌నాయుడు ఆ పాము కూడా పట్టుకున్నాడు. ఈ రెండు పాములను దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.

ఆ అధికారులను సస్పెండ్ చేయాలి: ఆర్‌ఎస్‌యూ

తిరుపతి(విద్య), జూన్ 25: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి సహకరిస్తున్న విద్యాశాఖాధికారులను సస్పెండ్ చేయాలని రివల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్‌ఎస్‌యూ) నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌ఎస్‌యూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. డీఈవో, ఆర్‌ఐవోలు ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీకి సహకరిస్తున్నారని ఆరోపించారు. సంఘం నాయకులు రోసిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



వెంకటరమణ మృతదేహం

పాకాల, జూన్ 25: ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాకాల అదనపు ఎస్‌ఐ లోకేష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా సదుం వాల్మీకి వీధికి చెందిన ఎం.కృష్ణయ్య కుమారుడు వెంకటరమణ (24) రెండేళ్ల క్రితం ఏజీబీఎస్సీ పూర్తిచేశాడు. అప్పటి నుంచి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఉద్యోగం కోసం వెళ్లివస్తానని ఇంటినుంచి మోటరు సైకిల్‌పై బయలుదేరి వెళ్లాడు. పాకాల మండలం కొమ్మిరెడ్డిగారిపల్లె-వెంకట్రామాపురం మార్గంలోని వల్లివేడు క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న మామిడితోటలో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం మామిడితోట యజమాని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఉద్యోగం రాలేదనే వేదనతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి అదనపు ఎస్‌ఐ లోకేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



పాకాల, జూన్ 25: గాదంకి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ ఇరుగు గురుమూర్తి, టీడీపీ నాయకులు సుబ్బయ్య, రాజు, సుబ్బు, రవి, చంద్రమౌళి, హరి, వెంకటేష్, సుదర్శన్, రఫీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



కామేశ్వరరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 25: ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ ఫిజిక్స్ అధ్యాపకులు కె.కామేశ్వరరావు ఎస్వీయూ నుంచి డాక్టరేట్ పొందారు. వర్సిటీ ఫిజిక్స్ విభాగంలో 'స్టడీస్ ఇన్ సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ ఎక్స్‌రే క్రిస్టోగ్రాఫిక్ స్టడీస్ ఆన్ సమ్ బైలాజికలీ ఇంపార్టెన్స్ కాంపౌండ్స్' అనే అంశంపై ప్రొఫెసర్ కృష్ణయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

మల్లంగుంట సచివాలయంలో దొంగలు పడ్డారు..!

ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

తిరుపతి రూరల్, జూన్ 25: తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట గ్రామ పంచాయతీలోని సచివాలయంలో పట్టపగలే దొంగలు పడి కంప్యూటర్లు, సీపీయూ, ప్రింటర్లు ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగుచూసింది. గ్రామ సచివాలయంలో శనివారం ఉదయం చోరీ జరిగితే సోమవారం తిరుపతిరూరల్ పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శి ఎంజీ రమేష్‌బాబు పేరిట ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ.12వేలు ఉంటుందని ఆయన ఫిర్యాదులో పేర్కొనడం ఆశ్చర్య పరుస్తోంది. పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లోని వివరాల మేరకు.. అటెండర్‌గా పనిచేసే విజయకుమారి భర్త ఎస్.ఫకీరప్ప అలియాస్ వరుణ్ రోజూ మాదిరిగానే 22న శనివారం ఉదయం 8.10గంటలకు సచివాలయ కార్యాలయాన్ని ఓపెన్ చేసి తాళంచెవిని మాత్రం తన వెంట తీసుకెళ్లారు. తర్వాత స్వీపర్ వల్లి వచ్చి కార్యాలయాన్ని శుభ్రం చేసి వెళ్లగా.. 9.30గంటలకు విధులకు హాజరైన సచివాలయ కార్యదర్శి ఎం.నీరజ.. కంప్యూటర్లు, ప్రింటర్లు, సీపీయూలు లేని విషయం గమనించి పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దాంతో వెంటనే ఆయన సచివాలయానికి వెళ్లి చూడగా చోరీకి గురైనట్లు గుర్తించి ఉన్నతాధికారులకు తెలియపరిచారు. ఈ విషయంపై విచారణ చేపట్టాలని కోరుతూ ఈనెల 24న తిరుపతిరూరల్ పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి ఉండటం గమనార్హం. చోరీకి గురైన రెండు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు, రెండు సీపీయూల విలువ కేవలం రూ.12వేలు ఉంటుందని కార్యదర్శి ఫిర్యాదులో పేర్కొనడంపై గ్రామస్థుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామస్థులు ఎప్పుడూ తిరుగుతూ ఉండే ఈప్రాంతంలో పట్టపగలే చోరీ ఎలా జరిగి ఉంటుందని చర్చించుకుంటున్నారు.

అసాంఘిక కార్యక్రమాలు అరికట్టండి: ఏఐఎస్‌ఎఫ్



బాలాజీకి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

తిరుపతి(విద్య/కలెక్టరేట్), జూన్ 25: తిరుపతి పద్మావతిపురంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బయటి వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, వాటిని అడ్డుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు తిరుపతి ఉప విద్యాశాఖాధికారి బాలాజీకి మంగళవారం ఫిర్యాదుచేశారు. విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి మాట్లాడుతూ... తరగతులు అయిపోయిన తరువాత సాయంత్రం బయటి వ్యక్తులు పాఠశాల ఆవరణలో మద్యం తాగడం, సీసాలను అక్కడే పగులగొట్టడం చేస్తున్నారని, దీనివల్ల ఆటస్థలంలో విద్యార్థులు ఆడుకునేందుకు భయపడాల్సిన పరిస్థితులు ఉన్నాయని వివరించారు. బయటి వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్‌కుమార్, ప్రవీణ్, నగర అధ్యక్షులు హరికృష్ణ, ఇతర నాయకులు డీవైఈఓను కలిసిన వారిలో ఉన్నారు.

తిరుచానూరులో ఆగని ఇసుక దందా

● సర్కారు మారినా తవ్వకాలు ఆపని వైసీపీ మాఫియా



ఎక్స్‌కవేటర్‌తో తిరుచానూరు వద్ద స్వర్ణముఖిలో పట్టపగలు తోడేస్తున్న ఇసుక



ఇసుకను తీసుకెళుతున్న ట్రాక్టర్లు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 25: ఐదేళ్లుగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీ నాయకులు తిరుపతి రూరల్ మండలంలో స్వర్ణముఖి నదిలో లక్షలాది రూపాయల ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి స్వర్ణముఖి నదిని 15 అడుగుల వరకు తోడేశారు. తిరుచానూరు, పాడిపేట, తనపల్లె, కొత్త మంగళం వద్ద ఇసుకాసురుల దెబ్బకు స్వర్ణముఖినది ఆనవాళ్లే కోల్పోయింది. అప్పటి వైసీపీ ప్రభుత్వానికి భయపడిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి అనుచరులు చంద్రగిరి నుంచి రేణిగుంట వరకు ఐదేళ్ల పాలనలో సహజ వనరుల దోపిడీకి పాల్పడ్డారు. అయితే టీడీపీ ప్రభుత్వం వచ్చి చంద్రబాబు సీఎం అయినా కూడా తిరుచానూరు, పాడిపేట, కొత్తమంగళం సమీపంలో స్వర్ణముఖి నదిలో ఎక్స్‌కవేటర్లు పెట్టి పట్టపగలే వందలాది ట్రాక్టర్లతో ఇసుక రవాణా జరుగుతోంది. మంగళవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. ముళ్లపూడి, తిరుచానూరు ప్రాంతంలో ఇసుకను డంపింగ్ చేసి అక్రమ రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఇసుకాసురులకు అండగా నిలుస్తున్న సెబ్, రెవెన్యూ, పోలీసు అధికారులపై చర్యలు తీసుకుని, ఇసుక అక్రమరవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సఖి వన్ స్టాప్ సెంటర్ సందర్శన

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 25: తిరుపతిలోని ఓల్డ్ మెటర్నటీ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సఖి వన్‌స్టాప్ సెంటర్, గృహహింస చట్టం విభాగం కేంద్రాలను జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ యోగేస్ దూబే మంగళవారం సందర్శించారు. కేంద్రంలో బాధితులకు అందుతున్న సేవలను, వారి వివరాలను తెలుసుకున్నారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వీలైనంత త్వరగా భర్తీ చేయాలని ఆదేశించారు. అధికారులు జయలక్ష్మి, డాక్టర్ శేఖర్, సుజాత, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



సఖి కేంద్రాన్ని పరిశీలిస్తున్న యోగేష్ దూబే

సి.మల్లవరం సచివాలయంపై వైసీపీ బోర్డుల తొలగింపు



మాజీ సీఎం జగన్ (నవరత్నాలు) బోర్డు తొలగిస్తున్న దృశ్యం



మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరును తొలగిస్తున్న దృశ్యం

తిరుపతి రూరల్, జూన్ 25: తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీ సచివాలయం, ఆరోగ్యకేంద్ర కార్యాలయాలపై ఉన్న మాజీ సీఎం జగన్ చిత్రంతో కూడిన నవరత్నాల నేమ్ బోర్డు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరును మంగళవారం తొలగించారు. టీడీపీ గ్రామ ఇన్‌చార్జి మనోహర్‌చౌదరి నేతృత్వంలో గ్రామస్థులతో టీడీపీ నేతలు కలసి వాటిని తొలగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కూడా సచివాలయ భవనంపై మాజీ సీఎం ఫొటో, మాజీ ఎమ్మెల్యే పేరు ఉండటంపై ఇటీవల టీడీపీ నాయకులు ర్యాలీగా కార్యాలయానికి వెళ్లి వాటిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. రెండ్రోజుల్లో తొలగిస్తామని కార్యదర్శి హామీ ఇవ్వగా, వెళ్లిపోయారు. వారంరోజులు గడుస్తున్నా తొలగించకపోవడంతో గ్రామస్థులతో టీడీపీ నాయకులు కలసి వెళ్లి ఫొటోలు, నేమ్ బోర్డులను తొలగించారు. ఈసందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే నానీకి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మనోహర్ చౌదరి మాట్లాడుతూ అధికారులు తమపద్ధతులు మార్చుకోవాలని, కూటమి ప్రభుత్వం ఏర్పాటై 20రోజులకు పైగా గడుస్తున్నా ఇప్పటికీ మాజీ సీఎం, ఎమ్మెల్యేల ఫొటోలు, నేమ్ బోర్డులను తొలగించకపోవడం బాధాకరమని మండిపడ్డారు. అలాగే పంచాయతీలో గతప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై విచారించాలని డిమాండ్ చేశారు. నాయకులు రవికుమార్ నాయుడు, షావలి, రఘు, గణేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో బాబు, పవన్ చిత్రపటాలు



తిరుపతి, జూన్25 (ఆంధ్రజ్యోతి): 36వ డివిజన్ సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలను డివిజన్‌కు చెందిన టీడీపీ, జనసేన నాయకులు ఏర్పాటుచేశారు. దీనికి ముందు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు చిత్తూరు రవిశంకర్ యాదవ్ (సుబ్బు యాదవ్), ఆవుల శంకర యాదవ్, శేషు, ఆముదాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

విశేషాలంకారంలో గంగమ్మ

తిరుపతి (కల్చరల్), జూన్ 25: తాతయ్యగుంట గంగమ్మ వార్షిక జాతర తర్వాత ఐదో మంగళవారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. పొంగళ్లుపెట్టి, వేయికళ్ల దుత్తలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు.. భక్తులకు పసుపు, కుంకుమలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని రంగు రంగుల పూలు, ముత్యాల హారాలు, రంగు దారాలతో విశేషంగా అలంకరించారు. రాయలసీమ రంగస్థలికి చెందిన పలువురు కళాకారులు వివిధ దేవతావేషాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో మమత, తదితరులు పాల్గొన్నారు.



వేషాలలో మొక్కులు తీర్చుకున్న చిన్నారులు



దేవతావేషాల్లో కళాకారులు

పద్మావతి పాఠశాల ఘటనపై ఇన్‌చార్జ్ కలెక్టర్ తీవ్ర ఆగ్రహం



పద్మావతిపురం జడ్పీహైస్కూల్ వద్ద అనధికారికంగా ఉన్న క్రికెట్ అకాడమీని పరిశీలిస్తున్న డీవైఈవో బాలాజీ, పంచాయతీ, ట్రాన్స్‌కో అధికారులు

● విచారణకు ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 25: ఓ ఆర్టీసీ ఉద్యోగి గత అధికారపార్టీ నేతల అండతో తిరుపతి రూరల్ మండలంలోని పద్మావతిపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను బెదిరించి మైదానంలో అనధికారికగా క్రికెట్ అకాడమీ నెలకొల్పాడు. భారీ ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలు విలువ చేసే విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డాడు. ప్రశ్నించిన స్థానికులు, ఉపాధ్యాయులపై బెదిరింపులకు పాల్పడ్డాడు. తనకంటూ పాఠశాలలో గేటు ఏర్పాటు చేసుకోవడంతో దాని ద్వారా గంజాయి మూక పాఠశాలలోకి ప్రవేశించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసేవారు. దీనిపై 'జడ్పీ హైస్కూల్ మైదానంలో ప్రైవేటు క్రికెట్ అకాడమీ!' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఇన్‌చార్జ్ కలెక్టర్ ధ్యానచంద్ర.. సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ చేయాలని ఆదేశించారు. దాంతో ఆగమేఘాలపై డీవైఈవో బాలాజీ, ఎంఈవో దేవరాజులరెడ్డి తదితరులతోపాటు, అటు ట్రాన్స్‌కో, ఇటు పంచాయతీ అధికారులు పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఉపాధ్యాయులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనధికారికంగా క్రికెట్ అకాడమీ నిర్వహిస్తూ ఏకంగా పాఠశాల ప్రహరీ కూల్చి గేటు ఏర్పాటు చేసిన ఆర్టీసీ ఉద్యోగి వాసుదేవరెడ్డి నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. తక్షణమే అనధికారంగా ఏర్పాటు చేసిన గేటు తొలగించి.. యుద్ధప్రాతిపదికన ప్రహరీ నిర్మిస్తామని.. తిరిగి పాఠశాలలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు ఉంటాయని సదరు ఉద్యోగిని హెచ్చరించారు. క్రికెట్ అకాడమీని స్వాధీనం చేసుకుని పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇస్తామని అధికార బృందం తేల్చిచెప్పింది.

విద్యుత్ చౌర్యం మాటేమిటి?

ఐదేళ్లుగా భారీ ఫ్లడ్‌లైట్లతో ఇక్కడ యువతకు శిక్షణ ఇచ్చారు. లక్షలాది రూపాయల విద్యుత్ చౌర్యం జరిగినా కూడా తమకేమీ పట్టదన్నట్లు ఎస్పీడీసీఎల్ అధికారులు మౌనంగా ఉండటమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాలన్నింటిపై అధికారులు డీఈవో శేఖర్‌కు నివేదిక అందించారు. ఆ నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు డీఈవో తెలిపారు. కాగా.. మాజీ సర్పంచులు రవి, గణపతి నాయుడు, టీడీపీ నేత సుబ్రహ్మణ్యం నాయుడు, స్థానికులు కూడా జడ్పీ ఉన్నతపాఠశాలలో ఆర్టీసీ ఉద్యోగి చేస్తున్న దురాగతాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సదరు ఆర్టీసీ ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. దీనిపై పద్మావతిపురం విద్యుత్ అధికారిని వివరణ కోరగా.. తమకేమి సంబంధం లేదని, వీధిదీపాల నుంచి విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డాడని, తమకెలాంటి ఇబ్బంది లేదని చెప్పడం గమనార్హం.

గూడూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా తిరిగి హనుమంతరావు నియామకం

ఆదేశాలు జారీ చేసిన డీహెచ్

తిరుపతి(వైద్యం), జూన్ 25: రుయా డిప్యూటీ సీఎస్‌ఆర్ఎంవోగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ హనుమంతరావును తిరిగి గూడూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (డీహెచ్) అధికారి పద్మావతి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. హనుమంతరావు.. డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తూ ఏడు నెలల మెడికల్ సెలవుపై వెళ్లారు. ఈనెల 17వ తేదీతో సెలవులు ముగియడంతో ఆయన డీహెచ్‌ను కలవడంతో రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు. అయితే గతంలో పనిచేస్తున్న శాఖలో రిలీవ్ కాకుండా నేరుగా డిప్యూటీ సీఎస్‌ఆర్ఎంవోగా బాధ్యతలు స్వీకరించడంతోపాటు మెడికల్ లీవ్‌లో ఉన్న సమయంలో ప్రైవేటు మెడికల్ కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసరుగా పనిచేశారు. ఈ విషయంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో వెంటనే డీహెచ్‌కు రిపోర్టు చేయాలని ఆదేశాలందాయి. దీంతో ఆయన మంగళవారం డీహెచ్‌ను కలవడంతో తిరిగి గూడూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమించారు. అలాగే ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారించాక, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆ ఆదేశాల్లోనే డీహెచ్ పేర్కొన్నారు.

డీఎంహెచ్‌వోకు బదులు డీహెచ్ రిలీవ్ చేయవచ్చు

గతంలో పనిచేసిన శాఖలో రిలీవ్ కాకనే రుయా డిప్యూటీ సీఎస్‌ఆర్ఎంవోగా తాను బాధ్యతలు స్వీకరించారనే విషయంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై డాక్టర్ హనుమంతరావు స్పందించారు. ఏడు నెలలు సెలవులో ఉన్న కారణం వల్ల తాను తిరిగి విధుల్లో చేరాలన్నా, రిలీవ్ కావాలన్నా డీఎంహెచ్‌వోకు రిపోర్టు చేయాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా డీహెచ్‌కు రిపోర్టు చేస్తే సరిపోతుందని, అలాగే తనను రిలీవ్ చేసే అధికారం డీహెచ్‌కు ఉందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



సీఎం చంద్రబాబుతో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సుగుణమ్మ, నరసింహయాదవ్, శ్రీధర్ వర్మ

సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ నాయకులు

తిరుచానూరు/తిరుపతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును మంగళవారం పలువురు టీడీపీ నాయకులు కలిశారు. వీరిలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నాయకులు నరసింహయాదవ్, శ్రీధర్ వర్మ, తదితరులున్నారు.

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ భారతి కూడా చంద్రబాబును కలిశారు. యూనివర్సిటీలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల గురించి తెలియజేశారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపండి

సెబ్ అధికారులతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



సెబ్ అధికారులతో సమావేశమైన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 25: జిల్లాలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో మంగళవారం జిల్లాలోని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులతో సమీక్షించారు. గంజాయి విక్రయాలు, రవాణాను వంద శాతం అరికట్టాలని కోరారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా... అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హోం మంత్రి ఆదేశాల మేరకు మత్తు పదార్థాల రహిత రాష్ట్రంగా తయారు చేయడానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాపైనా నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సెబ్ రాజేంద్ర, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు



టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తిరుపతి(విద్య), జూన్ 25: కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలకు చేరుతారని, తద్వారానే గౌరవం, గుర్తింపు, సంపద వస్తాయని డీఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని న్యూబాలాజీ కాలనీలోని భాష్యం బృహస్పతి క్యాంపస్‌లో ఫ్రెషర్స్ డే, అత్యధిక మార్కులు సాధించినవారికి సన్మాన కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. జోనల్ ఇంచార్జి యల్. లక్ష్మణరావుతో కలిసి పదో తరగతిలో 590కిపైగా మార్కులు తెచ్చుకున్న విద్యార్థులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు నేతాజీ, శ్రీనివాసులు, ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ వర్క్స్ యూనియన్ కార్యవర్గం



అశోకన్, అశోక్‌కుమార్, విశ్వనాథం

తిరుపతి అర్బన్, జూన్ 25: టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ వర్క్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎంపికైంది. ఇటీవల జరిగిన సీక్రెట్ బ్యాలెట్ ఓటింగ్ పద్ధతిలో అధ్యక్ష పదవికి 87ఓట్లతో ఎం.అశోకన్ గెలుపొందగా, ప్రధాన కార్యదర్శి పదవికి 71ఓట్లతో బి.అశోక్‌కుమార్ విజయం సాధించారు. ట్రెజరర్ పదవికి పోటీ లేకుండా ఈ.విశ్వనాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరికి స్నేహితులు, బంధువులు అభినందనలు తెలియజేశారు.

టీడీపీ అధికారంలోకి రావడంతో తిరుత్తణిలో తలనీలాల సమర్పణ



చంద్రగిరి, జూన్ 25: రాష్ట్రంలో టీడీపీ అధికారంలో రావడం, చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం, అదేవిధంగా చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని గెలుపొందడంతో మండలంలోని బుచ్చినాయుడుపల్లెకు చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు వేణు, శ్రీనివాసమంగాపురంకు చెందిన టీడీపీ కార్యకర్త గురున్నాథంలు తమిళనాడులోని తిరుత్తణిలో వెలసిన సుబ్రమణ్యంస్వామికి మంగళవారం తల నీలాలు సమర్పించారు. వారు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పలికి, రాష్ట్రంలో మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా, చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని స్వామివారిని మొక్కుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్వామివారి తల నీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు కనుమూరి చెంచయ్యనాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు బుద్ధుడి ప్రవచనం పుస్తకావిష్కరణ

తిరుపతి (కల్చరల్), జూన్ 25: ప్రముఖ పౌరహక్కుల నేత బొజ్జా తారకం జయంతిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం 5 గంటలకు యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం సమావేశ మందిరంలో బుద్ధుడి ప్రవచనం పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వేమన విజ్ఞాన కేంద్రం, దళిత సాహిత్య వికాస వేదిక సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

● బాలికల వసతి గృహంలో మేయర్ శిరీష


నీటి సంపును పరిశీలిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి (జీవకోన), జూన్ 25: చెన్నారెడ్డి కాలనీలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై మంగళవారం ఉదయం చెన్నారెడ్డి కాలనీలో ఉన్న వసతిగృహాన్ని మేయర్ స్థానిక కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించారు. సమస్యలపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ పునీత వెంకటేష్, నాయకులు రాజేష్, వెంకటేష్, అరుణ్‌కుమార్, స్రవంతి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులున్నారు.

'మా స్థలాన్ని వారిదంటున్నారు'


మాట్లాడుతున్న రాజేశ్వరి, ఆమె కుమారుడు గోపీకృష్ణారెడ్డి

తిరుపతి (జీవకోన), జూన్ 25: దాదాపు నాలుగు దశాబ్ధాలుగా కొర్లగుంట, సంజయ్‌గాంధీ కాలనీ తిరుమల బైపాస్‌రోడ్డులో తాము జీవనం సాగిస్తున్నామని, పక్కనే ఉన్న వెంకటసుబ్బమ్మ.. వారి కుటుంబం బైపాస్ రోడ్డుకు స్థలాన్ని కోల్పోయి తమ స్థలాన్ని వారి స్థలంగా సృష్టించుకున్నారని రాజేశ్వరి, ఆమె కుమారుడు గోపీకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం వారు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమ స్థలంలో వెంకటసుబ్బమ్మ కుటుంబం ఇల్లు నిర్మించుకుంటున్నారని, దీనిపై తాము పలుమార్లు కోరినా కూడా సర్వేకు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. సర్వేకు సంబంధించి అధికారులు వచ్చినా దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపించారు. వాస్తవంగా సర్వే చేస్తే వెంకటసుబ్బమ్మ, ప్లాట్ రోడ్డుకు పోయినట్లు స్పష్టమవుతోందని వివరించారు.

కొరమేనుగుంటలో వైభవంగా గంగమ్మ జాతర


వేడుకల్లో పాల్గొన్న నవీన్‌కుమార్‌రెడ్డి, భువన్‌కుమార్‌రెడ్డి తదితరులు

తిరుపతి (జీవకోన), జూన్ 25: తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని ఐదో మంగళవారం కొరమేను గుంట ఎస్టీకాలనీలోని గ్రామదేవత గంగమ్మతల్లి జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుడు రమేష్, ధర్మకర్తలు రాఘవేంద్ర, ధనలక్ష్మి, నాగరాజు, భారతి, శంకరయ్య, ఆశిక్ తదితరుల ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డి, గ్రామస్తులతో కలిసి కలిసి అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పుణ్యకోటి, చిన్న, సిద్ధయ్య, సుబ్రహ్మణ్యం, జన, ఎంకె కృష్ణ, మురళిస్వామి, మహేష్, రమేష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

మోకీలు మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నాం

బర్డ్ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ కిషోర్ కుమార్

తిరుపతి, జూన్25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బర్డ్ ఆస్పత్రిలో పేదలకు ఉచితంగా మోకీలు మార్పిడి ఆపరేషన్లు యథావిధిగా జరుగుతున్నాయని సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ కిషోర్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బర్డ్‌లో ఉచిత మోకీలు మార్పిడి ఆపరేషన్లు నిలిపేశారన్న ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు. రోగులకు సూచించిన అపాయింట్‌మేరకు ఉచితంగా అన్ని రకాల ఆర్థో ఆపరేషన్లు నిర్వహిస్తున్నామన్నారు. రోగులు ఎలాంటి అపోహలకు గురికావద్దని సీఎస్‌ఆర్‌ఎంవో కోరారు.

మొదటిఘాట్‌లో అదుపుతప్పిన కారు

కర్ణాటక భక్తులకు స్వల్పగాయాలు


ప్రమాదానికి గురైన కారు - స్వల్పగాయాలతో బయటపడిన భక్తులు

తిరుమల, జూన్25 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌లో మంగళవారం ఓ కారు అదుపుతప్పింది. అదృష్టవశాత్తు కారులోని భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కర్ణాటకకు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనం ముగించుకుని మంగళవారం సాయంత్రం కెఎ 05 ఎంటీ 6249 నెంబరు గల వ్యాన్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 26వ మలుపువద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి కుడివైపునున్న చిన్నపాటి గట్టును ఢీకొంది. వేగం అదుపుకాకపోవడంతో రోడ్డుపక్కనే ఉన్న చిన్న గుంతలోకి వెళ్లి ఆగిపోయింది. అదృష్టవశాత్తు కారులోని ఐదుగురు భక్తులు స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు.

తరగతుల విలీనాన్ని వెనక్కు తీసుకోవాలి

● మంత్రి లోకేశ్‌కు ఆపస్ వినతి



తిరుపతి(విద్య), జూన్ 25: గత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీనాన్ని వెనక్కు తీసుకోవాలని తిరుపతికి చెందిన ఆపస్ నాయకులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కోరారు. రాష్ట్ర రాజధాని అమరావతిలోని సెక్రటేరియట్‌లో మంగళవారం ఆపస్ నాయకులు విద్యాశాఖ మంత్రిని కలిసి పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ఉపాధ్యాయుల గౌరవాన్ని ఇనుమడింపజేస్తామని, వారిని బోధనకే పరిమితం చేస్తూ మిగిలిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సంఘటన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, కోశాధికారి సురేష్‌కుమార్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ లోకేశ్‌ను కలిసినవారిలో ఉన్నారు.

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల వ్యయ వివరాలను సమర్పించాలి: డీఆర్వో


సమావేశంలో పాల్గొన్న డీఆర్వో పెంచలకిషోర్, చరణ్ రుద్రరాజు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 25: సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులందరూ వారి తుది ఎన్నికల వ్యయ వివరాలు, ఖాతా వివరాలను తక్షణం ఎన్నికల వ్యయ పరిశీలకులకు సమర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీ నేతలతో కలెక్టరేట్‌లో మంగళవారం డీఆర్వో సమావేశం అయ్యారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి ఖర్చు వివరాలను ఈనెల 30 లోగా నియోజకవర్గ వ్యయపరిశీలకులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల వ్యయ నోడల్ అధికారి చరణ్ రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఈస్ట్ మీడియా స్టడీస్‌తో మహిళా వర్సిటీ ఎంవోయూ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 25: సౌత్ ఈస్ట్ ఏషియన్ మీడియా స్టడీస్‌తో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం యూనివర్సిటీలో మీడియా రంగ బోధన, పరిశోధనలకు చాలా ఉపయోగపడుతుందని వీసీ భారతి పేర్కొన్నారు. అలాగే, సంయుక్త ప్రాజెక్టులు, సదస్సులు, ప్రచురణలు చేపట్టడానికి అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, డీన్ విజయలక్ష్మి, పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.46 కోట్లు

తిరుమల, జూన్25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.46 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 77,878 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,140 మంది తలనీలాలు సమర్పించారు.

కేంద్ర మంత్రిని కలిసిన రాస్ బృందం



తిరుపతి(ఆటోనగర్), జూన్ 25: కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న రామ్మోహన్ నాయుడిని మంగళవారం ఢిల్లీలో రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు, డైరెక్టర్ వి.నాగరాజు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. రాస్ చేస్తున్న సేవలను మంత్రికి వివరించారు.

మందుబాబుల హల్‌చల్

అమలుకాని ఎస్పీ ఆదేశాలు




తిలక్ రోడ్డులో పట్టపగలే బహిరంగంగా మద్యం తాగుతున్న మందుబాబులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 25: తిరుపతిలో బహిరంగంగా మద్యం తాగేవారు కనిపించకూడదు. దీనికోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేశాం. మందుబాబులను పట్టుకొచ్చి స్టేషన్లలో కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ అటువంటి ఘటనలు జరగకుండా చూడాలని సాక్షాత్తూ ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. అయితే క్షేత్రస్థాయిలో ఆదేశాలు అమలు కావడం లేదు.

మచ్చుకు కొన్ని..

● తిరుమలలో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఉండగా, తిరుపతి బాలాజీ కాలనీలో పోలీసుల ఎదుటే మధు టీస్టాల్ వద్ద నలుగురు మందుబాబులు మద్యం మత్తులో ముష్టి యుద్ధానికి దిగారు. ఒకరినొకరు గట్టిగా అరుచుకుంటూ తన్నుకుంటున్నారు. అక్కడున్న ఇద్దరు పోలీసులూ ప్రేక్షక పాత్ర పోషించడం గమనార్హం.

● తాజాగా మంగళవారం ఇటువంటి సంఘటనే జరిగింది. తిలక్ రోడ్డులో మద్యం షాపు.. అక్కడే బజ్జీ కొట్టు వుంది. రోడ్డుపై మహిళలు కొందరు నడుచుకుంటూ వెళుతున్నారు. మరి కొందరు టీ దుకాణం వద్ద టీ తాగుతున్నారు. ఈ పరిస్థితుల్లో మద్యం తాగి కొందరు బాహాబాహీకి దిగారు. షర్టులు చించుకుంటూ, పంచెలు విప్పుకుని రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఇలా తిరుపతిలో మందుబాబుల ఆగడాలు నిత్యకృత్యమయ్యాయి.

షాపుల వద్ద మద్యం తాగకూడదు

మద్యం షాపుల వద్ద మందు తాగకూడదు. కానీ గత ప్రభుత్వ హయాంలో పట్టించుకునేవారు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ మద్యం తాగడం మొదలుపెట్టారు. ప్రభుత్వ మద్యం షాపులు మొత్తం అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఉండటంతో అక్కడే టిఫిన్ షాపులు, బజ్జీ కొట్లు వెలిశాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ తరచూ గొడవలు జరగడం మామూలై పోయింది. నెల రోజుల వ్యవధిలో 25 ఘటనలు చోటు చేసుకున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ఘటనలు ఎక్కువగా తిలక్ రోడ్డు, దేవేందర్ థియేటర్ రోడ్డు, డీబీఆర్ ఆసుపత్రి రోడ్డు, మంగళం రోడ్డులోని ఆపిల్ బారు, ఎస్టీవీనగర్, ఐఎస్‌మహల్ రోడ్డు, చెన్నారెడ్డికాలనీ, ఎంఆర్‌పల్లె సర్కిల్ ప్రాంతాల్లో ఎక్కువైంది. ఇకనైనా మందుబాబుల ఆగడాలను పోలీసులు అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎర్రమిట్టలో పట్టపగలు దొంగలు పడ్డారు

అరటికాయల వ్యాపారి ఇంట్లో భారీ చోరీ ● 188 గ్రాముల బంగారు నగలు, రూ.15లక్షల అపహరణ


దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ రవిమనోహరాచ్చారి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 25: తిరుపతి ఎర్రమిట్టలోని ఒక వ్యాపారి ఇంట్లో పట్టపగలు దొంగలు పడ్డారు. తలుపు తాళాలు పగులకొట్టి ఇంటిలో వున్న రూ.15 లక్షలతోపాటు 188 గ్రాముల బంగారు నగలు అపహరించుకుని వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు క్రైం సీఐ మురళీకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. ఎర్రమిట్టలో కాపురమున్న ఎం.చెంగల్‌రెడ్డి స్థానిక గంగమ్మ గుడి వద్ద అరటికాయల వ్యాపారం చేస్తున్నాడు. తన కుమార్తె పుష్పావతి ఎర్రమిట్టలో ఇల్లు కట్టుకోవడం కోసం బ్యాంకులో సుమారు రూ.15 లక్షలు లోను తీసి బీరువాలో భద్రంగా దాచి ఉంచారు. మంగళవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి భార్య, కుమారుడు అరటికాయల దుకాణం వద్దకు వెళ్లారు. ఆ తర్వాత గంటసేపటికి ఎదురింటి వారు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని తెలిపారు. దీంతో వారు హుటాహుటిన ఇంటి వద్దకు రాగా, బయట తలుపులు పగులకొట్టి బీరువాలో వున్న బట్టలు చిందరవందరగా పడవేసి ఉండటాన్ని చూసి అవాక్కయ్యారు. బీరువాను పరిశీలించగా రూ.15 లక్షలు, 188 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. ఇల్లు మొత్తం వెతికినా ఫలితం లేకపోవడంతో వెంటనే అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ రవిమనోహరాచ్చారి, సీఐ రామారావు, ఎస్‌ఐలు ఘటనా స్థలానికి వెళ్లి ఇంటి మొత్తం పరిశీలించి డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. ఫింగర్ ప్రింట్ తీసి, జరిగిన ఘటనపై బాధితులను విచారించారు. బాధితుడు చెంగల్‌రెడ్డి క్రైం సీఐ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా కొందరు అనుమానితులను విచారిస్తున్నట్లు సమాచారం. కేసును త్వరితగతిన ఛేదించి, బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు.

చెత్తబుట్టలో సీఎం చిత్రపటం

● డ్వామా కార్యాలయ అధికారుల తీరుపై మండిపడ్డ టీడీపీ నేతలు


సీఎం చంద్రబాబు చిత్రపటాలను చూపుతున్న టీడీపీ నేతలు

తిరుపతి రూరల్, జూన్ 25: తిరుపతి డ్వామా కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాన్ని చెత్త బుట్టలో మూలనపడేసి అవమానపరచారని ఆరోపిస్తూ టీడీపీ నేతలు మంగళవారం అధికారుల తీరుపై మండిపడ్డారు. కూటమి పార్టీల నేతలు సింగంశెట్టి సుబ్బరామయ్య, పోకల జనార్ధన్, రుద్రకోటి సదాశివం తదితరులు మంగళవారం డ్వామా కార్యాలయాన్ని సందర్శించగా.. కార్యాలయ గోడలపై ఎక్కడా సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు లేకపోవడాన్ని గమనించి అధికారులను ఆరా తీశారు. ఈ క్రమంలో చంద్రబాబు చిత్రపటం ఒకమూలన చెత్తబుట్టలో పడేసి ఉండటాన్ని చూసి అవాక్కయ్యారు. ఈవిషయమై అధికారులను నిలదీస్తే పొంతనలేని సమాధానాలు చెప్పారని వాపోయారు. రాష్ట్రంలో 164 సీట్ల భారీ మెజారిటీతో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వానికి సంబంధించిన సీఎం ఫొటోను ప్రభుత్వ కార్యాలయంలో మూలన పడేయడమేమిటని అధికారులను ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన అధికారులు ఇంకా ఆపార్టీ మత్తులోనే ఉన్నారని, దీనికి బాధ్యులైన వారిని వెంటనే సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా మూలనపడేసిన చంద్రబాబు ఫొటోలకు టీడీపీ నేతలు పాలాభిషేకం చేసి.. కార్యాలయంలో ఏర్పాటు చేశారు. వెంకటరాయల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మరింత సౌకర్యవంతంగా వసతి కల్పించాలి

అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతంగా, పారదర్శకంగా వసతి కల్పించాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం సాయంత్రం ఆయన జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, రిసెప్షన్, ఐటీ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వసతి విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమలలో ఎన్ని గదులు అందుబాటులో ఉన్నాయి, ఎంతమంది యాత్రికులకు వసతి కల్పించవచ్చు అనే అంశాలపై ఈవోకు వివరించారు. సీడీ రీఫండ్, దళారులను గుర్తించడంతో పాటు వారిని నియంత్రించే మార్గాలు, తిరుపతిలో అందుబాటులో ఉన్న వసతి, కొత్తగా నిర్మాణంలో ఉన్న పీఏసీలు, ఇతర సిబ్బందిత అంశాలపై ఈవో సమీక్షించారు. అనంతరం పదేపదే వసతి పొందుతున్న వారి వివరాలను, గదులను సక్రమంగా ఖాళీ చేయకపోవడం, ఇతర సమస్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈవోలు హరీంద్రనాథ్, భాస్కర్, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, ఐటీ జీఎం సందీప్‌రెడ్డి, ఓఎస్డీ సత్రేనాయక్, ఏఈవో వెంకటేశ్వర్లు నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏపీఆర్ సెట్ ఇంటర్వ్యూలు ప్రారంభం


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 25: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి చేపట్టిన ఏపీఆర్‌సెట్-2024 ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని ఎంపిక చేసిన 12 యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూలు ప్రశాంతంగా సాగుతున్నాయి. ఈ నెల 28వ తేదీ దాకా ఇంటర్వ్యూల ప్రక్రియ కొనసాగనుంది. ఇంటర్వ్యూలను ఏపీఆర్ సెట్ కన్వీనర్ దేవప్రసాదరాజు, కో-కన్వీనర్ హేమ పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ.. ఎస్వీ యూనివర్సిటీలో కెమిస్ట్రీ, ఫిజిక్స్ ఎడ్యుకేషన్, అడల్ట్ ఎడ్యుకేషన్, ఉర్దూ, సంస్కృతం, హిందీ, ఇంటర్నేషనల్ ఏరియా స్టడీస్, జువాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్టు చెప్పారు. త్వరలోనే ర్యాంకులు ప్రకటిస్తామన్నారు. సబ్జెక్టు నిపుణులు ప్రొఫెసర్ జానకిరామయ్య, ప్రొఫెసర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో బోధనేతర ఉద్యోగుల బదిలీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 25: ఎస్వీయూనివర్సిటీలో పలువురు బోధనేతర ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ● ఫిజిక్స్ విభాగంలో పనిచేస్తున్న డి.మధుసూదన నాయుడు రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ● రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న టి.వి.ఎస్. లక్ష్మీనారాయణను ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఏఏవోగా బదిలీపై పంపారు. ● ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్స్ ఏఏవోగా ఉన్న బి.కవితను సైన్స్ కాలేజీ ఏఏవోగా బదిలీ చేశారు. వీరితో పాటు మరో ఐదుగురు సీఎంఎం క్యాడర్ ఉద్యోగులకు స్థానచలనం కల్పించింది. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

శెట్టిపల్లె భూ బాధితులకు న్యాయం చేయండి

కమిషనర్‌కు విన్నవించిన కమిటీ


వివరాలను అడిగి తెలుసుకుంటున్న అదితిసింగ్

మంగళం, జూన్ 25: శెట్టిపల్లె భూముల్లో ప్లాట్లను కొనుగోలు చేసిన వేలాదిమంది సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని నగరపాలక కమిషనర్ అదితిసింగ్‌ను శెట్టిపల్లె ప్లాట్ల బాధితుల కమిటీ కన్వీనర్ రాధాకృష్ణ, సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం కోరారు. మంగళవారం అర్బన్ మండల రెవెన్యూ అధికారులతో కలిసి శెట్టిపల్లె భూములను కమిషనర్ పరిశీలించారు. ప్రజా ఫిర్యాదుల వేదికలో భూ బాధితులు ఇచ్చిన వినతితో ఆమె ఇక్కడికి వచ్చారు. సమస్యలన్నీ అడిగి తెలుసుకున్న ఆమె మాట్లాడుతూ.. త్వరితగతిన శెట్టిపల్లె భూసమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అర్బన్ తహసీల్దారు అశోక్, ఆర్‌ఐ జానీ బాషా, సర్వేయర్ వెంకటరమణ, వీఆర్వో భూపతి ఆచారి, సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వేణుగోపాల్, బుజ్జి, శీను, నాయకులు పార్థసారధి, చిన్నవెంకటయ్య, కృష్ణ, శెట్టిపల్లి ప్లాట్ల కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రాజేంద్ర, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల రక్షణే ప్రధాన లక్ష్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి రమేష్

తిరుపతి (కల్చరల్), జూన్ 25: చిన్నారుల రక్షణ కోసం పనిచేస్తున్న వారందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని రాస్ చైల్డ్ ఫండ్ ప్రాజెక్టు అధికారి రమేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల్లో చిన్నారుల కోసం పని చేస్తున్న పలు రంగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రాస్ భవనంలో మంగళవారం సమావేశమయ్యారు. వే ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ పైడి అంకయ్య, కల్పన (డీసీపీయు), రామకృష్ణారెడ్డి (ఆర్‌పీఎఫ్), శేఖర్ (సిర్డ్ సంస్థ), కృష్ణమూర్తి (రియల్స్ ఎన్‌జీఓ), తేజస్విని (ఎంఎస్‌కె), స్వాతి (ధాత్రి ఫౌండేషన్), రాస్ బాల వికాస్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ భారతి, సీడీపీఓలు సుధారాణి, కృష్ణమంజరి తదితరులు పాల్గొన్నారు.

అరగంటకో బస్సు నడపండి

● ప్రజా రవాణా అధికారితో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే రామకృష్ణ
● ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

వెంకటగిరి, జూన్ 25: వెంకటగిరి ఆర్టీసీ డిపో నుంచి తిరుపతి, నెల్లూరు మార్గాల్లో ప్రతి 30 నిమిషాలకో బస్సు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రజా రవాణా అధికారిని కోరారు. 'రద్దైన ఆర్టీసీ సర్వీసులు... ఇబ్బందుల్లో ప్రయాణికులు' పేరిట ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. వెంకటగిరి డిపో మేనేజరు రామకృష్ణను పిలిపించి ఉన్న బస్సు సర్వీసులను రద్దు చేసి ప్రయాణికులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. తమ ప్రభుత్వంలో ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. అనంతరం తిరుపతి ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. గతంలో బెంగళూరు, చెన్నై, కీల్పాక్కంలకు వెంకటగిరి డిపోనుంచి బస్సు సరీసులు నడిచేవని వాటిని రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరారు.

చెస్ టోర్నీ పోస్టర్ల ఆవిష్కరణ



వెంకటగిరి, జూన్ 25: అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని జులై 21న పట్టణంలోని మదర్ అకాడమీలో జరగనున్న ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నీ పోస్టర్లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆవిష్కరించారు. ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణరావు, జిల్లా అసోసియేషన్ కోఆర్డినేటర్ నర్రా విజయ్, టీడీపీ నాయకులు బి.రాజేశ్వరరావు, ఆర్‌రాజా తదితరులు పాల్గొన్నారు

టీడీపీ సీనియర్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



రమణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

డక్కిలి, జూన్ 25 అనారోగ్యంతో బాధపడుతున్న డక్కిలి మండలం వెలికల్లుకు చెందిన జిల్లా సెంట్రల్‌బ్యాంక్ మాజీ డైరెక్టరు వెలికంటి రమణారెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే కురుగొండ్ల ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పి.రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బి.రాజేశ్వరావు, జి.వెంకటముని, పి.కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ సత్రంలో పిచ్చికుక్క స్వైరవిహారం

14 మందికి గాయాలు



చికిత్స పొందుతున్న బాధితురాలు

వెంకటగిరి, జూన్ 25: మండలంలోని పాలకొండ సత్రం లో సోమవారం అర్ధరాత్రి గ్రామస్తులపై పిచ్చికుక్క దాడిచేసింది. ఈ ఘటనలో పలువురు ఆస్పత్రి పాలయ్యారు. ఉక్కపోత భరించలేక గ్రామంలో ఆరుబయట నిద్రిస్తున్న 14 మందిపై పిచ్చికుక్క దాడి చేసింది. వారంతా వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొం దుతున్నారు. మంగళవారం పిచ్చికుక్కను గ్రామస్తులు కొట్టి చంపేశారు.

రెండు బైకుల ఢీ

ఒకరి మృతి ● ఇద్దరికి తీవ్ర గాయాలు



మధు మృతదేహం

వెంకటగిరిటౌన్, జూన్ 25: మండల పరిధిలోని మొగళ్లగుంట వద్ద రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సోమవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు... పెట్లూరు గ్రామానికి చెందిన డి.మధు(18) వెంకటగిరికి వస్తున్నారు. వెంకటగిరి నుంచి నాయుడుపేట మండలం తుమ్మూరుకు చెందిన పి.కీర్తిరాజు, ఆయన భార్య శిరీషా నాయుడుపేట వైపు వెళ్తున్నారు. మొగళ్లగుంట వద్ద వీరి బైక్‌లు ఢీకొనడంతో మధు అక్కడిక్కడే మృతి చెందారు. కీర్తిరాజు, శిరీషా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయాకి తరలించారు. మధు మృతదేహాన్ని వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ కిరణ్, సందీప్ - ప్రమాద దృశ్యం

దొరవారిసత్రం, జూన్ 25: మండలంలోని కుప్పారెడ్డిపాళెం సమీపంలో దాబా వద్ద మంగళంవారం సాయంత్ర జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వాకాడుకు చెందిన పి.కిరణ్, ఆయన ఐదేళ్ల కుమారుడు సందీప్ తీవ్రంగా గాయపడ్డారు. మద్యం మత్తులో ఉన్న కిరణ్ తన కుమారుడితో కలిసి ఉగ్గుమూడికి వెళ్ళేందుకు వాకాడు నుంచి దొరవారిసత్రం వచ్చాడు. దొరవారిసత్రం నుంచి వెదురుపట్టు రోడ్డులో రాంగ్ రూట్‌లో జాతీయ రహదారిపై తన బైక్‌లో ప్రయాణిస్తుండగా కారు ఢీ కొని వెళ్లిపోయింది. ప్రమాదంలో తండ్రీకొడుకులు రహదారిపై పడిపోవడంతో కిరణ్‌కు కాలు విరిగింది. సందీప్‌కు తలకు బలమైన రక్త గాయమైంది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

15 దుంగలు, 4 వాహనాల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లు, ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూన్ 25: కడప జిల్లా మల్లేపల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 15 ఎర్రచందనం దుంగలతోపాటు రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో ఆర్‌ఎస్‌ఐ మురళీధర్‌రెడ్డి బృందం మంగళవారం కడపజిల్లా మల్లేపల్లి అటవీప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. సమీపంలోని ఆటోనగర్ చేరుకునేసరికి అక్కడ కొందరు స్మగ్లర్లు రెండు కార్లలో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. చుట్టుముట్టగా కొందరు పారిపోయారు. ఆరుగురు స్మగ్లర్లను పట్టుకున్నారు. విచారణలో వీరిని కడపకు చెందిన యాతగిరి హరి(42), కొప్పిలి సుధాకర్‌రెడ్డి(29), తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ప్రభు(30), రమేష్(31), రవి(34), అయ్యప్పన్ మునియన్(20)గా గుర్తించారు. వీరినుంచి రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలతోపాటు 15 ఎర్రచందనం దుం గలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఐదుగురు స్మగ్లర్ల కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. అరెస్టుచేసినవారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు.

బీసీ బాలికలకు 'జూనియర్ గురుకులం' అందని ద్రాక్షే!

అవస్థలు పడుతున్న విద్యార్థినులు ● ఆవేదనలో తల్లిదండ్రులు

కోట, జూన్ 25 : రెండు దశాబ్దాలుగా బీసీ బాలికలకు మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల జూనియర్ కళాశాల ఎండమావిగా మిగిలింది. ఆయా బీసీ బాలికల గురుకులాల్లో 10వ తరగతి వరకు చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు ఇంటర్ చదువుకునేందుకు గురుకుల జూనియర్ కళాశాలలు లేక ఉన్నత చదువులకు స్వస్తి పలుకుతున్నారు. ప్రభుత్వాలు మారినా ప్రజా ప్రతినిధులు మారుతున్నా బీసీ బాలికల జూనియర్ కళాశాల అందని ద్రాక్షలా మారింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కోటలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర జూనియర్ కళాశాల ఉంది. ఈ జూనియర్ కళాశాల, పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా తిరుపతి జిల్లా బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్‌గా వ్యవహరిస్తుంటారు. అయితే బీసీ గురుకులాల్లో 10వ తరగతికి మాత్రమే గురుకుల పాఠశాలలు ఉండటం, ఆపై బాలికలకు జూనియర్ కళాశాలలు లేవు. జోన్ 1 పరిధిలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల, విశాఖ జిల్లా తానాంలలో బాలికలకు గురుకుల కళాశాలలున్నాయి. జోన్ 3 పరిధిలో కృష్ణా, గుంటూరు, ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పూలే బీసీ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలు ఎక్కడా లేవు. అదే విధంగా ఆ గురుకుల కళాశాలల పరిధిలో నిజాంపట్నం, దొరవారిసత్రం, కోటలలో మాత్రమే బాలురలకు ప్రత్యేకంగా జూనియర్ కళాశాలలున్నాయి. మిగతా ఎక్కడ బీసీ బాలికలకు జూనియర్ కళాశాలలు లేకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక స్తోమతలేని బలహీన వర్గాల పిల్లలు టెన్త్‌లో మంచి మార్కులు సాధించినప్పటికీ ఇంటర్.. ఆపై చదువులు చదివేందుకు బీసీ గురుకులాలు లేకపోవడంతో బాలికల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రతిభా పాటవాలు కలిగి మంచి చదువులు చదువుకోవాలన్న తపన ఉన్నప్పటికీ ఆ విద్యార్థినుల ఆశలు ఎండమావిగానే మారిపోతున్నాయి. ప్రతి విద్యాసంవత్సరంలోనూ వందలాది మంది బీసీ బాలికలు 10వ తరగతిలో 500 మార్కులకుపైగా సాధించి ఇంటర్ చదివేందుకు బీసీ బాలికల జూనియర్ కళాశాల లేకపోవడంతో వారు అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులకు శాపనార్థాలు పెడుతున్నారు.

విద్యార్థులకు అసౌకర్యం కలిగిస్తే ఉపేక్షించేది లేదు



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్

గూడూరు అర్బన్, జూన్ 25: ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలిగించే ఏలాంటి చర్యలను ఉపేక్షించబోనని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని చెన్నూరు ఎస్టీ గురుకుల పాఠశాలను ఆయన డీఎంహెచ్‌వో శ్రీహరితో కలిసి తనిఖీ చేశారు. గురుకులంలో నీటి వసతులను, గదులను ఆయ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకులంలో భోజనం సరఫరా చేసే కాంట్రాక్టరు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. రెండు రోజుల క్రితం చెన్నూరులో జరిగిన సంఘటన ఎక్కడైనా పునరావృతం అయితే ఉపేక్షించేదిలేదని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. చెన్నూరు గురుకులంలో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన 20 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. చికిత్స అనంతరం కోలుకున్న విద్యార్థులపై పర్యవేక్షణ ఉంచాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా మిగతా విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా సరిహద్దు జలాల్లోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు



తూపిలిపాళెం మత్స్యకారులతో మాట్లాడుతున్న అధికారులు

వాకాడు, జూన్ 25: తమిళనాడు రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు సరిహద్దులు దాటి ఆంధ్రాలోకి ప్రవేశించి మత్స్యసంపదను దోచుకెళ్లడంపై ఇక్కడి గంగపుత్రులు నష్టపోతున్నారని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు అన్నారు. మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో మంగళవారం ఆయన మత్స్యకారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తమిళనాడు రాష్ట్రం నాగపట్టినం, కడలూరు, తూత్తుకుడి, పుదుచ్చేరి రాష్ట్రానికి చెందిన కారైక్కల్ ప్రాంతాల జాలర్లు ఆంధ్రా సరిహద్దుల్లోకి ప్రవేశించి వేట సాగించడంపై నాగపట్టినం అసిస్టెంట్ జాయింట్ డైరెక్టర్, చెన్నై ఫిష్ హార్బర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆంధ్రా సరిహద్దుల్లోకి ప్రవేశించే తమిళ జాలర్ల బోట్ రిజిస్ట్రేషన్, లైసెన్స్‌తోపాటు డీజల్‌పై రాయితీని రద్దు చేస్తామని ఆ రాష్ట్ర అధికారులు తమకు చెప్పా రన్నారు. ఇకపై తమిళ జాలర్లు ఆంధ్రా సరిహద్దుల్లోకి ప్రవేశిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన ఎఫ్‌డీవోలు రెడ్డినాయక్, రఘుబాబు తదితరులున్నారు.

గూడూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా తిరిగి హనుమంతరావు

ఆదేశాలు జారీ చేసిన డీహెచ్

తిరుపతి(వైద్యం), జూన్ 25: రుయా డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవోగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ హనుమంతరావును తిరిగి గూడూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (డీహెచ్) అధికారి పద్మావతి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. హనుమంతరావు.. డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తూ ఏడు నెలల మెడికల్ సెలవుపై వెళ్లారు. ఈనెల 17వ తేదీతో సెలవులు ముగియడంతో ఆయన డీహెచ్‌ను కలవడంతో రుయా డిప్యూటీ సీఎస్ ఆర్‌ఎంవోగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు. అయితే గతంలో పనిచేస్తున్న శాఖలో రిలీవ్ కాకుండా నేరుగా డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవోగా బాధ్యతలు స్వీకరించడంతోపాటు మెడికల్ లీవ్‌లో ఉన్న సమయంలో ప్రైవేటు మెడికల్ కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసరుగా పనిచేశారు. ఈ విషయంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో వెంటనే డీహెచ్‌కు రిపోర్టు చేయాలని ఆదేశాలందాయి. దీంతో ఆయన మంగళవారం డీహెచ్‌ను కలవడంతో తిరిగి గూడూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమించారు. అలాగే ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారించాక, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆ ఆదేశాల్లోనే డీహెచ్ పేర్కొన్నారు.

డీఎంహెచ్‌వోకు బదులు డీహెచ్ రిలీవ్ చేయవచ్చు

గతంలో పనిచేసిన శాఖలో రిలీవ్ కాకనే రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ ఎంవోగా తాను బాధ్యతలు స్వీకరించారనే విషయంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై డాక్టర్ హనుమంతరావు స్పందించారు. ఏడు నెలలు సెలవులో ఉన్న కారణం వల్ల తాను తిరిగి విధుల్లో చేరాలన్నా, రిలీవ్ కావాలన్నా డీఎంహెచ్‌వోకు రిపోర్టు చేయాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా డీహెచ్‌కు రిపోర్టు చేస్తే సరిపోతుందని, అలాగే తనను రిలీవ్ చేసే అధికారం డీహెచ్‌కు ఉందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చెత్తబుట్టలో సీఎం చిత్రపటం

డ్వామా కార్యాలయ అధికారుల తీరుపై మండిపడ్డ టీడీపీ నేతలు



సీఎం చంద్రబాబు చిత్రపటాలను చూపుతున్న టీడీపీ నేతలు

తిరుపతి రూరల్, జూన్ 25: తిరుపతి డ్వామా కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాన్ని చెత్త బుట్టలో మూలనపడేసి అవమానపరచారని ఆరోపిస్తూ టీడీపీ నేతలు మంగళవారం అధికారుల తీరుపై మండిపడ్డారు. కూటమి పార్టీల నేతలు సింగంశెట్టి సుబ్బరామయ్య, పోకల జనార్ధన్, రుద్రకోటి సదాశివం తదితరులు మంగళవారం డ్వామా కార్యాలయాన్ని సందర్శించగా.. కార్యాలయ గోడలపై ఎక్కడా సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు లేకపోవడాన్ని గమనించి అధికారులను ఆరా తీశారు. ఈ క్రమంలో చంద్రబాబు చిత్రపటం ఒకమూలన చెత్తబుట్టలో పడేసి ఉండటాన్ని చూసి అవాక్కయ్యారు. ఈవిషయమై అధికారులను నిలదీస్తే పొంతనలేని సమాధానాలు చెప్పారని వాపోయారు. రాష్ట్రంలో 164 సీట్ల భారీ మెజారిటీతో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వానికి సంబంధించిన సీఎం ఫొటోను ప్రభుత్వ కార్యాలయంలో మూలన పడేయడమేమిటని అధికారులను ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన అధికారులు ఇంకా ఆపార్టీ మత్తులోనే ఉన్నారని, దీనికి బాధ్యులైన వారిని వెంటనే సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా మూలనపడేసిన చంద్రబాబు ఫొటోలకు టీడీపీ నేతలు పాలాభిషేకం చేసి.. కార్యాలయంలో ఏర్పాటు చేశారు. వెంకటరాయల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చర్యలు



రైతులతో చర్చిస్తున్న తహసీల్దారు, రెవెన్యూ సిబ్బంది

చిల్లకూరు, జూన్ 25: సాగరమాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన మండలంలోని ఉడతావారిపార్లపల్లికి చెందిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసులు చెప్పారు. కోల్పోయిన భూముల వద్ద టెంటు ఏర్పాటు చేసుకుని నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న రైతులతో మంగళవారం తహసీల్దారు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వారి భూములకు సంబంధించిన రికార్డులను అందజేయాలన్నారు. వివరాలను ఉన్నతాధికారులకు అందించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమ్య, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

స్వామివారికి వేడుకగా వసంతోత్సవం

చక్రస్నానంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

గూడూరు, జూన్ 25: పట్టణంలోని రాజా వీధిలో కొలువైవున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీని వాసమూర్తికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం, వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం చక్రస్నానం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పూర్ణాహుతి జరిగింది. రాత్రికి ధ్వజావరోహణం చేపట్టారు.

ఎర్రమిట్టలో పట్టపగలు దొంగలు పడ్డారు

అరటికాయల వ్యాపారి ఇంట్లో భారీ చోరీ ● రూ.15లక్షల నగదు, 188 గ్రాముల బంగారు నగల అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 25: తిరుపతి ఎర్రమిట్టలోని ఒక వ్యాపారి ఇంట్లో పట్టపగలు దొంగలు పడ్డారు. తలుపు తాళాలు పగులకొట్టి ఇంటిలో వున్న రూ.15 లక్షలు నగదు, 188 గ్రాముల బంగారు నగలు అపహరించుకుని వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు క్రైం సీఐ మురళీకృష్ణ తెలిపిన వివరాల మేరకు.... ఎర్రమిట్టలో కాపురమున్న ఎం.చెంగల్‌రెడ్డి స్థానిక గంగమ్మ గుడి వద్ద అరటికాయల వ్యాపారం చేస్తున్నాడు. తన కుమార్తె పుష్పావతి ఎర్రమిట్టలో ఇల్లు కట్టుకోవడం కోసం బ్యాంకులో సుమారు రూ.15 లక్షలు లోను తీసి బీరువాలో భద్రంగా దాచి ఉంచారు. మంగళవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి భార్య, కుమారుడు అరటికాయల దుకాణం వద్దకు వెళ్లారు. ఆ తర్వాత గంటసేపటికి ఎదురింటి వారు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని తెలిపారు. దీంతో వారు హుటాహుటిన ఇంటి వద్దకు రాగా, బయట తలుపులు పగులకొట్టి బీరువాలో వున్న బట్టలు చిందరవందరగా పడవేసి ఉండటాన్ని చూసి అవాక్కయ్యారు. బీరువాను పరిశీలించగా రూ.15 లక్షల నగదు, 188 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. ఇల్లు మొత్తం వెతికినా ఫలితం లేకపోవడంతో వెంటనే అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ రవిమనోహరాచ్చారి, సీఐ రామారావు, ఎస్‌ఐలు ఘటనా స్థలానికి వెళ్లి ఇంటి మొత్తం పరిశీలించి డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. ఫింగర్ ప్రింట్ తీసి, జరిగిన ఘటనపై బాధితులను విచారించారు. బాధితుడు చెంగల్‌రెడ్డి క్రైం సీఐ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొందరు అనుమానితులను విచారిస్తున్నట్లు సమాచారం. కేసును త్వరితగతిన ఛేదించి, బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్న ఆటో

ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 25: నాయుడుపేట-అన్నమేడు క్రాస్ రోడ్డు జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఆటో ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కోవూరుకు చెందిన సంతోష్, సోయల్ తమ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తికి ఆటోలో వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో నాయుడుపేట అన్నమేడు క్రాస్‌రోడ్డు వద్ద ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొనింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న సోయల్, సంతోష్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మోకీలు మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నాం

బర్డ్ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ కిషోర్ కుమార్

తిరుపతి, జూన్25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బర్డ్ ఆస్పత్రిలో పేదలకు ఉచితంగా మోకీలు మార్పిడి ఆపరేషన్లు యధావిధిగా జరుగుతున్నాయని సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ కిషోర్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బర్డ్‌లో ఉచిత మోకీలు మార్పిడి ఆపరేషన్లు నిలిపేశారన్న ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు. రోగులకు సూచించిన అపాయింట్‌మేరకు ఉచితంగా అన్ని రకాల ఆర్థో ఆపరేషన్లు నిర్వహిస్తున్నామన్నారు. రోగులు ఎలాంటి అపోహలకు గురికావద్దని సీఎస్‌ఆర్‌ఎంవో కోరారు.

రహదారి భద్రతా నియమాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

కోట, జూన్ 25 : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు రహదారి భద్రతా నియమాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు రోజులుగా ఆంధ్రా నేవల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 4వ వార్షిక శిక్షణ శిబిరం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు జిల్లాల నుంచి వచ్చిన క్యాడెట్లకు ఆయుధ శిక్షణ ఇచ్చారు. గేమ్స్, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌ఐ నాగబాబు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. బాల్యం నుంచే ప్రతి ఒక్కరు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, జి.నరేంద్రబాబు, నాగరాజు, పెంచలయ్య, మస్తానయ్య, లక్ష్మీనారాయణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకతవకలపై విచారణ జరిపించండి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నాలో ఊనుగుంటపాళెంవాసులు

కోట, జూన్ 25: మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ జరపించాలని గ్రామస్తులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఊనుగుంటపాళెం పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేట్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పనులకు రానివారికి కూలీ జమ చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఆయనకు ఇష్టం వచ్చిన వారికి ఎక్కువగా డబ్బులు వేస్తున్నారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే పనులకు వచ్చినప్పటికీ పైసా కూడా బ్యాంక్ ఖాతాలో జమ చేయడం లేదన్నారు. తమ గ్రామంలో గతంలో అమృత్ సరోవర్ కింద లక్షల రూపాయలతో ఉపాధి హామీ పనులు జరిగాయన్నారు. ఆ పనులన్నీ లోప భూయిష్టమన్నారు. భారీగా అవకతవకలు జరిగి లక్షలాది రూపాయలు పక్కదారి పట్టాయన్నారు. దీనిపై తక్షణం విచారణ జరిపించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నినాదాలు చేసి వినతిపత్రాన్ని ఆ పథకం ఏపీవో పూర్ణిమకు అందజేశారు. ఏపీవో మాట్లాడుతూ ఊనుగుంటపాళెం సీనియర్ మేట్‌ను విధుల నుంచి తొలగిస్తున్నామన్నారు.

మాదక ద్రవ్యాలను అడ్డుకుందాం



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ హరికృష్ణ

కోట, జూన్ 25: మాదక ద్రవ్యాల మహమ్మారిని అవగాహనతో తరిమికొడదామని వాకాడు సీఐ హరికృష్ణ పిలుపునిచ్చారు. కోట పట్టణంలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో మంగళవారం వాకాడు సెబ్ అధికారుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో అలాంటి మాదక ద్రవ్యాల అలవాటు పడవద్దన్నారు. చదువుకునే వయసులో విజ్ఞానంపై మక్కువ పెంచుకోవాలని ప్రాణాలను హరించే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్‌ఐ నాగబాబు, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ తదితరులు ఉన్నారు.

అదనపు కట్న వేధింపులపై కేసు

కోట, జూన్ 25: మండలంలోని విద్యానగర్‌కు చెందిన షరీఫా తన భర్త ఫిరోజ్ అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు చేయడంలో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. వాకాడు మండలం సాయిబులపాళెంకు చెందిన ఫిరోజ్‌కు కోట మండలం విద్యానగర్‌కు చెందిన షరీఫాతో 6 నెలల క్రితం వివాహం జరిగింది. పుట్టింటి నుంచి అన్ని లాంఛనాలు ఇచ్చినప్పటికీ తన భర్త, కుటుంబీకులు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాంటూ ఫిర్యాదు చేశారు.

ఉదయం ఎండ... సాయంత్రం చినుకులు

● భిన్నమైన వాతావరణం

తడ, జూన్ 25: వానలు కురవాల్సిన సమయంలో భిన్నమైన వాతావరణం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉదయం ఎండకాస్తుంటే... సాయంత్రం మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు కురుస్తున్నాయి. పది రోజులుగా ఇదే విధంగా వాతావరణం నెలకొని ఉంది. తెల్లవారుజాము నుంచి మాడు పగలగొట్టే ఎండ కాస్తూ... మధ్యాహ్నం వరకు ఇబ్బంది పెడుతోంది. సాయంత్రానికి మబ్బులు కమ్ముకుంటాయి. సన్నటి జల్లు కురిసి మబ్బులు మాయమైపోతున్నాయి. ఆ తరువాత గాలి వీయక ఉక్కపోత ఉంటోంది. ఈ భిన్నమైన వాతావరణంలో రాత్రి గడిచేకొద్ది అటు ఇళ్లల్లో ఉండలేక, బయట చల్లగాలిలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటువంటి వాతావరణ పరిస్థితులను ఎప్పుడు చూడలేదని జనం అనుకుంటున్నారు.

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అర్బన్, జూన్ 25: గూడూరులో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాల్లోని మురుగు కాలువలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. నాలుగు రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన గూడూరువాసులకు మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఊపిరిపీల్చుకున్నారు.

మిగిలి ఉన్న సీట్ల భర్తీకి 27న ప్రవేశపరీక్ష

వాకాడు, జూన్ 25: మండలంలోని అంబేద్కర్ గురుకులంలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 27న ఉదయం 10 గంటలకు రాత పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ రామాంజనేయులు తెలిపారు. విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వాకాడు గురుకులంలో ప్రవేశం లభిస్తుందన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



ధనలక్ష్మి (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, జూన్ 25: అనుమానాస్పద స్థితిలో ధనలక్ష్మి(34) అనే వివాహిత మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని పోలి గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది. పోలి గ్రామానికి చెందిన బాలాజీ, ధనలక్ష్మి దంపతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. మూడు రోజుల క్రితం ఇంటి వద్ద అద్దం ముక్క ధనలక్ష్మి గొంతుపై తెగడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ధనలక్ష్మి గొంతుపై సరిగ్గా అద్దం ముక్కతో గాయపడింది అనేది మిస్టరీగా మారింది.

అందరిలో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

శ్రీకాళహస్తి, జూన్ 25: సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను కూకటి వేళ్లతో సహా పెకలించాలంటే అందరిలో శాస్త్రీయ దృక్పథం పెరగాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మంగళవారం సీపీఎం శాఖ కార్యదర్శులకు నాలుగు రోజుల రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బీజేపీ వంటి కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థ రాజకీయాల కోసం భౌతిక వాదానికి బదులు భావావాదాన్ని ప్రజల్లో ప్రేరేపిస్తున్నాయన్నారు. దీంతో మూఢనమ్మకాలతో పాటు మత, భావ విద్వేషాలను రెచ్చగొట్టి శాశ్వత అధికారం కోసం కుట్రలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. దీనివల్ల భావి భారత భవిష్యత్తుకు ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. సామాజిక రుగ్మతలను తరిమి కొట్టాలంటే ప్రతి సీపీఎం కార్యకర్త అసలైన భౌతికవాదిగా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, నాగరాజు, వెంకటేష్, మనోహర్, రాజా, వెలివేంద్రం, కుప్పమ్మ పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కార్యాలయాలను రెసిడెన్షియల్ హాస్టళ్లుగా మార్చండి

రేణిగుంట, జూన్ 25: రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన వైసీపీ కార్యాలయాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టళ్లుగా మార్చాలని విద్యార్థి సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని వైసీపీ నిర్మిస్తున్న జిల్లా పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం సమతా సైనిక్ దళ్, ఏఐఎస్ఎఫ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌డీ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం, నాగేంద్ర మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ హాస్టల్లో కనీస వసతులు లేకుండా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే రాష్ట్రంలో వైసీపీ కార్యాలయాలను హాస్టళ్లుగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు నాగార్జున, శ్రీరామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ

శ్రీకాళహస్తి, జూన్ 25: రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ది స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. విజయవాడలోని శాతవాహన కళాశాలలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల ఆర్చరీ పోటీలు జరిగాయి ఈ పోటీల్లో కె.లోహితారెడ్డి అండర్-13లో ప్రథమ స్థానం, అండర్-15లో ద్వితీయ స్థానం, ఎస్. పార్థివ్ అండర్-15లో ద్వితీయ స్థానంలో నిలిచారు. మంగళవారం ఆ విద్యార్థులను కరస్పాండెంట్ జనార్దన్‌రావ్ పవార్ సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు విశాల, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు స్వాగతం

నారాయణవనం, జూన్ 25: రెండు రోజుల కుప్పం పర్యటన నిమిత్తం విచ్చేసిన సీఎం చంద్రబాబుకు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, నారాయణవనం జడ్పీటీసీ సుమన్ కుమార్ స్వాగతం పలికారు. మంగళవారం మధ్యాహ్నం పీఈసీ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు విచ్చేసిన చంద్రబాబుకు ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సుమన్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సుమన్‌కుమార్

సబ్‌స్టేషన్లలో ఫిర్యాదుల స్వీకరణ

ఏర్పేడు, జూన్ 25: సబ్‌స్టేషన్లలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఈ వాసుదేవయ్య తెలిపారు. మంగళవారం బండారుపల్లిలో విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీటర్ల మరమ్మతులు, సర్వీసు వైర్ల మార్పు, అధికంగా బిల్లుల జారీ, విద్యుత్ లైన్లు, మీటర్ల మార్పు తదితర సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈకార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 26వ తేదీన మునలిపేడు, 27న రాజులపాళెం, 28న వికృతమాల సబ్‌స్టేషన్లలో ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

వెలుగు రుణాల నగదు స్వాహాపై ఫిర్యాదు

వరదయ్యపాళెం, జూన్ 25: వెలుగు రుణాల నగదు స్వాహా చేసిన మాజీ వీవో లీడర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం మేరకు.... మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన వినాయక పొదుపు సంఘంలోని నలుగురు సభ్యులు రెండేళ్ల కింద గ్రామ సమాఖ్య ద్వారా రుణం తీసుకున్నారు. అప్పటి వీవో లీడరు జరీనమ్మకు నెలవారీగా వాయిదా సొమ్మును పూర్తిగా చెల్లించారు. ఇటీవల కొత్తగా రుణానికి దరఖాస్తు చేసుకోగా బకాయి చెల్లించాలని అధికారులు చెప్పడంతో మహిళలు అవాక్కయ్యారు. దీనిపై మాజీ వీవో లీడరును నిలదీయగా దిక్కున్న చోట చెప్పుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని బాధితులు వాపోయారు. ఎస్ఐ ప్రతాప్ మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు చేశారని, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగాల సృష్టికర్త చంద్రబాబు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 25: మానవ వనరులను సరైన రీతితో వినియోగించుకుంటూ తగిన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఉద్యోగాల సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టీడీపీ నాయకులు కొనియాడారు. మంగళవారం పట్టణంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో ఒక డీఎస్సీ కూడా విడుదల చేయకుండా నిరుద్యోగ యువతకు వైసీపీ ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.ఉమేష్‌రావు, నెమళ్లూరు బుజ్జి, మిన్నల రవి, నివేదిత మోరే, మునిరాజాయాదవ్, సయ్యద్ చాంద్‌బాషా, షేక్ రియాజ్, పూల శేఖర్, శివ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీసీఏ టెక్ట్స్‌బుక్ ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, జూన్ 25: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల కంప్యూటర్ అప్లికేషన్ విభాగంలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న డాక్టర్ ఎ.రవి ప్రసాద్ బీసీఏ కోర్సు మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన ప్రోగ్రామింగ్ ఇన్ సి విత్ ల్యాబ్ ఎక్సర్‌సైజ్ అనే టెక్ట్స్‌బుక్‌ను మరో ముగ్గురితో కలిసి రచించారు. మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీలత చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహవర్మ, బాపనయ్య, మునెయ్య, సతీష్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, రాజేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా శ్మశాన వాటిక



హిందూ శ్మశాన వాటిక - మందుబాబులు తాగి పడేసిన మద్యం సీసాలు

రేణిగుంట, జూన్ 25: రేణిగుంట పట్టణానికి చెందిన హిందూ శ్మశానవాటిక మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. శ్మశాన వాటికలో కనీస వసతులు లేకుండా ఎక్కడ చూసినా ముళ్లకంపలు, పొదలతో నిండిపోయి ఉండేది. అంత్యక్రియలకు సరైన వసతులు ఉండేవి కావు. ఇది గమనించిన పట్టణానికి చెందిన మాజీ సర్పంచులు, టీడీపీ నాయకులు, స్థానిక పెద్దలు కలిసి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీటీసీ నిధులతో శ్మశాన వాటిక లోపల సీసీ రోడ్డు, అంత్యక్రియలకు మండపాన్ని నిర్మించారు. శ్మశాన వాటికలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక హిందూ శ్మశాన వాటిక నిర్వహణను పంచాయతీ చేపట్టింది. అప్పటి నుంచి శ్మశానవాటిక మందుబాబులకు ఆవాస కేంద్రం మారిపోయింది. నిత్యం పేకాట ఆడుతూ, మద్యం సేవిస్తూ శ్మశానవాటికను జూదానికి నిలయంగా మార్చేశారు. శ్మశాన వాటిక సమీపంలో బాలికల ఉన్నత పాఠశాల ఉండటంతో మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో కొంతమంది మద్యం, గంజాయి మత్తులో ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడుపుతూ విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ విషయంపై గతంలోనే బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధని పోలీసులకు ఫిర్యాదు చేసినా నామమాత్రంగా చర్యలు తీసుకున్నారు. శ్మశాన వాటికలో ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. నీటి సరఫరా లేక మొక్కలు ఎండిపోతున్నాయి. పంచాయతీ కార్యదర్శి, సర్పంచు స్పందించి హిందూ శ్మశానవాటికను అభివృద్ధి పరచాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీసిటీని సందర్శించిన జపాన్ కాన్సుల్ జనరల్

శ్రీసిటీ, జూన్ 25: చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తకహాషి మునియో మంగళవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. శ్రీసిటీలో పెట్టుబడుల అవకాశాలు, వ్యాపార ప్రయోజనాల గురించి రవీంద్ర సన్నారెడ్డి వివరించారు. దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా శ్రీసిటీ అవతరించిందని, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, లాజిస్టిక్ వంటి 30కి పైగా జపనీస్ పరిశ్రమలు ఇక్కడ నెలకొల్పబడ్డాయని తెలిపారు. ఈ పరిశ్రమలన్నింటిలో కలిపి సుమారు రూ.18 వేల కోట్ల పెట్టుబడులతో 20వేల మందికి ఉపాది అవకాశాలు దొరికాయని చెప్పారు. శ్రీసిటీలోని మౌలిక వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కాన్సుల్ జనరల్, వ్యాపార నిర్వహణకు అనువైన పారిశ్రామికవాడలలో శ్రీసిటీ ఒకటని ప్రశంసించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలతో పాటు ప్రముఖ జపాన్ పరిశ్రమలు ఇసుజు, డైకిన్ ఇండియాను కాన్సుల్ జనరల్ సందర్శించారు.



జపాన్ కాన్సుల్ జనరల్ శ్రీసిటీ గురించి వివరిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

అక్షరాభ్యాసానికి విద్యాసామగ్రి అందజేత

శ్రీకాళహస్తి, జూన్ 25: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఉదయం గురుదక్షిణామూర్తి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం జరగనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం పట్టణానికి చెందిన వెంకటముని పెట్రోల్ బంక్ యజమాని మహేష్ అక్షరాభ్యాసానికి అవసరమయ్యే పలకలు, పుస్తకాలు, పెన్నులు, బలపాలను వితరణగా అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 25: మండలంలోని కాటూరు నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం ఎస్ఐ వెంకట నరసింహ స్వాధీనం చేసుకున్నారు.

డయేరియా వ్యాప్తి చెందకుడా చర్యలు తీసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 25: డయేరియా వ్యాప్తి చెందకుడా పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ వర్షాకాలంలో డయేరియా వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా పైపులైను లీకేజీల నివారణ, మురుగునీటి కాలువలు శుభ్రం చేయించడం వల్ల డయేరియా వ్యాప్తిని అరికట్ట వచ్చన్నారు. ముఖ్యంగా కలుషిత నీటిని తాగడం వల్ల డయేరియా వస్తుందన్నారు. అలాగే దోమలు వల్ల మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, డెంగ్యు, చికెన్ గున్యా వంటి జ్వరాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఈఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై సమీక్ష

రేణిగుంట, జూన్ 25: డయేరియా నివారణపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. మురుగు కాలువలు, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుచిరంజీవి, ఈవోపీఆర్డీ వెంకటరత్నప్రభ, ఏఈ పవన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

శ్రీకాళహస్తి, జూన్ 25: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్ రెడ్డి విజయం సాధించిన నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలం వాగివేడు మాజీ సర్పంచు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు తిరుమలకు పాదయాత్రగా మంగళవారం బయలుదేరారు. వీరి పాదయాత్రను టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, కామేష్‌యాదవ్, దొరైరాజ్‌రెడ్డి, రావిళ్ల రమేష్ తదితరులు జెండాఊపి ప్రారంభించారు.

బుచ్చినాయుడుకండ్రిగ నుంచి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 25: ఎన్డీఏ కూటమి విజయం సాధించిన నేపథ్యంలో మొక్కు తీర్చుకునేందుకు మండలంలోని ఆర్.అనంతపురం, జీఎన్ కండ్రిగ గ్రామాలకు చెందిన సుమారు 30 టీడీపీ నాయకులు మంగళవారం కాలినడకన తిరుమలకు బయలు దేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, పార్లమెంటు కార్యదర్శి సముద్రాల సుధాకర్ నాయుడు తదితరులు తిరుమలకు వెళ్లారు.

పుత్తూరు వార్తలు


అవగాహనతో వ్యాధులను అరికట్టవచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి

పుత్తూరు అర్బన్, జూన్ 25: అవగాహన ఉండడం ద్వారా వ్యాధులు దరి చేరకుండా అరికట్టవచ్చని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్, హెల్త్, అమినిటీ సెక్రటరీలు, అంగన్వాడీ కార్యకర్తలు, యూపీహెచ్ వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేసినట్లు చెప్పారు. అలాగే వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక డ్రైవ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ చిన్నారులకు వేడి చేసి చల్లార్చిన తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులు చిన్నారులు చేతులు శుభ్రంగా ఉంచుకునే విధంగా అవగాహన కలిగించాలన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అతిసారాతో పాటు ఇతర సీజన్ వ్యాధుల బారిపడకుండా రక్షించుకోవచ్చన్నారు. తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, డాక్టర్లు రమేష్, ఆశ, సీడీపీవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

చింతకాల్వలో మరుపొంగళ్లు



నడివీధి గంగమ్మ వద్ద అంబళ్లు పెట్టి పూజలు చేస్తున్న భక్తులు

వడమాలపేట, జూన్ 25: వడమాలపేట మండలంలోని చింతకాల్వ గ్రామంలో మంగళవారం జాతర మరుపొంగళ్లు పెట్టారు. 32ఏళ్ల అనంతరం గ్రామంలో చాంతాళ్ల గంగమ్మ జాతర నిర్వహించిన విషయం విధితమే. జాతర జరిగిన మొదటి మంగళవారం మరుపొంగళ్లు పెట్టాలి. ఇందులో భాగంగా ఉదయం గ్రామస్తులు నడివీధి గంగమ్మ వద్ద అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

మంత్రి సత్యకుమార్‌కు సన్మానం

పుత్తూరు అర్బన్, జూన్ 25: రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బీజేపీ నగరి అసెంబ్లీ కన్వీనర్ కేఎన్ హరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సోమవారం విజయ వాడలో మంత్రిని కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట జీ.ఉదయ్ కుమార్, బీ.మునిరత్నం, మహేంద్రబాబు, జయరాం నాయక్ తదితరులు ఉన్నారు.

అన్నదానం

పుత్తూరు అర్బన్, జూన్ 25: నగరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాశ్ అత్యధిక మెజార్టీతో గెలవడంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం పట్టణ పరిధిలోని గేటు పుత్తూరు గాంధీనగర్‌లో ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై, డీఎస్ గణేష్, జీవరత్నంనాయుడు, ఎన్ఎన్ ధనపాల్, జేసీబీ బాబు, బాబ్జీ, వెంకటేష్, అరుణాచలం, సాయి, మురళి, హరి తదితరులు పాల్గొన్నారు.

ప్లీజ్ ప్లీజ్... వెళ్లద్దండి

- గోడ దూకేందుకు సిద్ధమైన వైసీపీ కౌన్సిలర్లు
- హుటాహుటిన నగరికి చేరుకున్న రోజా
- కౌన్సిలర్లతో అంతర్గత సమావేశం

పుత్తూరు అర్బన్, జూన్ 25: ఎన్నికల్లో తగిలిన షాక్‌తో వైసీపీని ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పార్టీకి ప్రజలు ఇప్పటికే దూరమైనట్లు ఎన్నికల ఫలితాలతో తేలిపోవడంతో ఇక మనం ఉండి సాధించేదేముందని మున్సిపల్ కౌన్సిలర్లు అంచనాకు వస్తున్నారు. దీంతో రాజకీయ భవిష్యత్తును వెదుక్కొంటూ టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం 'టీడీపీతో టచ్‌లోకి వైసీపీ కౌన్సిలర్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో మాజీ మంత్రి రోజా సోమవారం చెన్నై నుంచి హుటాహుటిన నగరికి చేరుకున్నారు. పుత్తూరుకు చెందిన వైసీపీ కౌన్సిలర్లను ఇంటికి ఆహ్వానించి అంతర్గత సమావేశం నిర్వహించారు.

మీకు విలువ ఉండదు

కౌన్సిలర్లు టీడీపీతో టచ్‌లోకి వెళుతున్నారని ఆంధ్రజ్యోతిలో రావడంతో మంత్రి రోజా సోమవారం నగరి ప్యాలెస్‌లో అత్యవసరంగా సమావేశమయ్యారు. మొత్తం 22 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో ఇద్దరు ఎన్నికలకు ముందే టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ మంత్రి రోజా నిర్వహించిన సమావేశానికి నలుగురు కౌన్సిలర్లు వ్యక్తిగత కారణాలతో డుమ్మాకొట్టారు. మిగిలిన 16మంది మాత్రమే హాజరైనట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... సమావేశం ప్రారంభమైన వెంటనే ముందుగా ప్రజా సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో నిలదీయాలని కర్తవ్యబోధ చేసిన రోజా ఆ తరువాత అసలు విషయానికి వచ్చారు. 'టీడీపీ నాయకులు ప్రలోభపెడతారు... మీరు లొంగద్దండి. పత్రికల్లో వచ్చే కథనాలు మిమ్మల్ని గందరగోళానికి గురిచేస్తాయి. వాటిని పట్టించుకోవద్దు. అందరూ కలిసి ఉండడండి. నిబంధనల మేరకు నాలుగేళ్ల వరకు పాలక మండలిని టచ్ చేయ్యలేరు(కౌన్సిలర్లు వెళ్లిపోయినా పాలకమండలికి వచ్చిన ముప్పేమీ లేదు అని చెప్పే ప్రయత్నం) పార్టీ మారితే మీకు అక్కడ విలువ ఉండదు. ఒకరికొకరు అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండని' హితబోధ చేశారు. దీనికి స్పందనగా తామెవరూ పార్టీ మారే ఆలోచనలో లేమని కౌన్సిలర్లు రోజాకు హామీ ఇచ్చి బయటకు వచ్చారు.

అప్పుడు పూచికపుల్ల.. ఇప్పుడు బంగారు తీగా

అధికారంలో ఉన్నప్పుడు మున్సిపల్ కౌన్సిలర్లు పూచికపుల్ల.. అధికారం కోల్పోయాక బంగారు తీగలా కన్పిస్తున్నామని సమావేశం తరువాత బయటకు వచ్చిన కౌన్సిలర్లు వ్యాఖ్యానించడం కనిపించింది. టీడీపీకి వచ్చిన మెజార్టీ చూస్తే పార్టీ తిరిగి పుంజుకునే పరిస్థితి కనుచూపు మేరలో కనిపించడలేదని నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. చెప్పుడు మాటలు విని ఇప్పటికే ముఖ్యమైన నాయకులను దూరం చేసుకుని ఇప్పుడు మమ్మల్ని పార్టీ మారవద్దని బతిమాలుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వలంటీర్లకు ఇచ్చే గౌరవం కూడా తమకు దక్కలేదని ఆఫ్ ద రికార్డు కౌన్సిలర్లు వాపోయారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క కౌన్సిలర్‌కు అయినా ఒక్క పని చేసిపెట్టిన పాపాన పోలేదని గుర్తు చేసుకుంటున్నారు. పైగా టీడీపీతో టచ్‌లో ఉన్నావని, అసమ్మతి నాయకుడి వర్గమని ముద్ర వేసి వేధించిన విషయాన్ని తలుచుకుని కుమిలిపోతున్నారు. తమ దారి మేము చూసుకుంటే తప్ప భవిష్యత్తు ఉండదని అంతర్గత సంభాషణల్లో నిర్ధారణకు వచ్చారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ గేట్లు ఎత్తేస్తే మున్సిపాలిటీలో వైసీపీ పేక మేడలా కూలిపోవడం ఖాయమని వారే తేల్చి చెప్పేసున్నారు.

వైభవంగా ప్రసన్న వెంకటేశ్వరస్వామి చక్రస్నానం



శ్రీవారి చక్రస్నానం - శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం



ధ్వజ పటానికి హారతి ఇస్తున్న అర్చకులు

వడమాలపేట, జూన్ 24: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్వామి, అమ్మ వార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఉదయం 9.15 నుంచి 10.15 గంటల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామికి, చక్రత్తాళ్వార్‌కు పుష్కరిణి ఎదురుగా వేడుకగా స్నపన తిరుమంజనం చేపట్టారు. పాలు, పెరుగు, తేనే, పసుపు, చందనం, కొబ్బరి నీల్లుతో అభిషేకం చేశారు. అనంతరం పుష్కరిణిలో వద్ద చక్రత్తాల్వార్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు సూర్య కుమారాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు చక్రత్తాల్వార్‌కు గోవింద నామస్మరణలతో చక్రస్నానం నిర్వహించారు. అర్చకులు, అధికారులు, భక్తులు పెద్దఎత్తున స్నానాలు ఆచరించారు. సాయంత్రం 6-7 గంటల మధ్య నవసంధి, మాడవీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి 7నుంచి 7.30 గంటల మధ్య గరుడపటాన్ని అవనతం చేసి ధ్వజావరోహణం చేశారు. ధ్వజారోహణం రోజున ఆహ్వానించిన సకల దేవతా పరివారాన్ని సాగ నంపేలా అర్చక స్వాములు వేద మంత్రాలు పటిస్తూ ధ్వజ పటాన్ని కిందకు దింపి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.